

• కమనీయం...కావిడి ఉత్సవం

ద్వారకాతిరుమల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): 'సుబ్రహ్మణ్యం మాం పాహి...స్వామినాథ మాం పాహి'.. అంటూ భక్తులు కావిడిలను ధరించి శ్రీవారి క్షేత్రంలో ఆదివారం తిరుగాడారు. శ్రీవారి క్షేత్ర దత్తత దేవాలయమైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా జరిగిన ఈ కావిడి ఉత్సవం భక్తులకు నేత్రపర్వమైంది. సంప్రదాయబద్ధంగా పంచె, కండువా ధరించి ఈ సేవలో పాల్గొన్న భక్తులకు ఆలయంలో అర్చకులు వేదమంత్రోచ్చరణలతో కావిడిలను అందజేశారు. అనంతరం వారు సుబ్రహ్మణ్యుడి చిత్రపటంతో ఆయన నామాలను స్మరిస్తూ క్షేత్రంలో తిరుగగా వారి పాదాలను పలువురు భక్తులు కడిగి భక్తిభావాలను చాటారు. బాలలు సైతం ఇందులో పాల్గొనడం విశేషం.



• పోటెత్తిన భక్తజనం

ముదినేపల్లి మండలం సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి కల్యాణోత్స వాల్లో ఆదివారం సుమారు 30 వేల మంది భక్తులు పాల్గొని పూజలు జరిపారు. ఆలయం వద్ద పుట్టలో పాలు పోసి, సుబ్రహ్మణ్యేశ్వరుడిని దర్శించుకుని నాగ ప్రతిమలకు పూజలు జరిపారు.



ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు 222 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న బాల బాలికలకు ఆదివారం జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజనల్ కేంద్రాల్లో నిర్వహించిన జాతీయ ఉపకార వేతన (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 12 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు 2,788 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 2,566 మంది హాజరయ్యారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు నమోదు కాలేదన్నారు. 'ప్రాథమిక కీని బీఎస్ఈ వెబ్‌సైట్‌లో సోమవారం విడుదల చేయనున్నారు. అభ్యంతరాలను ఈనెల 16వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా సంబంధిత వెబ్‌సైట్ గ్రీవెన్స్ లింక్‌ద్వారా తెలపవచ్చు. కాగా పరీక్షలో ఆయా సామాజిక వర్గాల వారీగా నిర్ణీత అర్హత మార్కులు సాధించిన విద్యార్థుల జాబితాను నెలరోజుల్లోగా విడుదల చేయనున్నారు. ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి రెండేళ్ల ఇంటర్మీడియట్ విద్య పూర్తయ్యేవరకు ఏడాదికి రూ.12 వేలు చొప్పున బ్యాంకు ఖాతాకు కేంద్ర ప్రభుత్వం జమ చేస్తుంది. అయితే ఇంటర్ పూర్తయ్యే వరకు సంబంధిత విద్యార్థి హాస్టల్ వసతిలేని ప్రభుత్వ పాఠశాల/కళాశాలలో మాత్రమే చదువుతుండాలి. ఈ క్రమంలోనే గతేడాది ఎన్‌ఎంఎంఎస్‌కు జిల్లాలో ఎంపికైన 166 మంది విద్యార్థుల్లో 22 మంది ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతిలో చేరడంతో వారిని జాతీయ ఉపకార వేతనానికి ప్రభుత్వం అనర్హులుగా చేసింది.

కొల్లేరు..గలీజు!

మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిపై లంకవాసుల దండయాత్ర

ఐదేళ్ల వైసీపీ పాలనలో కొల్లేరులో రకరకాల వివాదాలు చోటు చేసుకున్నాయి. చెరువుల తవ్వకాలు, ఆక్రమణలు, గ్రామ పెద్దల పేరిట ఇంకొన్ని పంచాయి తీలు. ప్రత్యేకించి చెరువుల్లో చేపల పెంపకానికి అనువుగా చేసిన లీజు ఒప్పం దాలు కాస్తా గలీజుగానే మారాయి. కోట్ల రూపాయల మేర వ్యవహారం రోడ్డెక్కింది. ఇప్పుడు వైసీపీ అనుకూలురును లంకవాసులు నిలదీస్తున్నారు.

\- ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

- చెరువుల లీజు బకాయిల వివాదం
- రూ.ఆరు కోట్లు ఇవ్వాలంటున్న కోమటిలంక వాసులు
- రూ.రెండు కోట్లు బకాయిలు ఉన్నాయంటున్న శ్రీపర్రువాసులు
- లెక్కలు తేల్చండంటున్న అబ్బయ్య చౌదరి వర్గం
- కొండలరావుపాలెంలో కొల్లేరు లంకల ప్రజల నిరసనలు

అసలేం జరిగింది..

కొల్లేరు పరిధిలో కాంటూరు ఎగువ, దిగువ అనేక చేపల చెరువులు ఉన్నాయి. కొల్లేరులో లంక గ్రామాలుగా పేరొందిన కొన్నింటిలో ఆది నుంచి మూకుమ్మడి లీజు ఆనవాయితీ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే కోమటిలంక, శ్రీపర్రు గ్రామాల్లో ఉన్న చెరువులను లీజుకు తీసుకునేందుకు అనేక ప్రయత్నాలు సాగాయి. ఈ క్రమంలోనే 2019లో అధికార పగ్గాలు చేపట్టిన వైసీపీ నేతల కన్ను కాస్తా కొల్లేరుపై పడింది. మేము చెప్పినట్టుగానే లీజు చెల్లిస్తాం, మీరు మాత్రం ఉన్న చెరువులన్నింటినీ తమకే ఇవ్వాలంటూ ఒత్తిడి చేశారు. అప్పటి దెందులూరు ఎమ్మెల్యే అబ్బాయిచౌదరి, ఆయన అనుచరుల ఒత్తిడి మేరకు కోమటిలంక పరిధిలోని 180 ఎకరాల చేపల చెరువుల్లో 60 ఎకరాలను వీరందరికీ లీజుగా ఇచ్చారు. ఈ 180 ఎకరాల్లో మూడు భాగాలు కాగా, మూడో భాగం ఒక వర్గం పరిధిలోకి వెళ్లింది. వారే ఏడాదికి రూ.70 వేలు లీజు చెల్లించే క్రమంలో చౌదరి వర్గానికి అగ్రిమెంట్ ఇచ్చారు. గడిచిన నాలుగేళ్లుగా ఈ వ్యవహారమంతా సాగుతూ వచ్చిందని కోమటి లంక వాసులే చెబుతున్నారు. అధికారం నుంచి దిగిపోయే ముందు తమకు రావాల్సిన లీజును ఇంకా పెండింగ్‌లోనే పెట్టారని, ఇది మొత్తం మేర ఆరు కోట్లు ఉందని ఆందోళన చేపట్టారు. అబ్బయ్యచౌదరి ఇంటి ముందే గడిచిన రెండు రోజులుగా నిరసనలకు దిగారు. తమకు లీజు రూపంలో చెల్లించాల్సిన రూ.ఆరు కోట్లను చెల్లించాల్సిందేనని కోమటిలంకవాసులు పట్టుపడుతున్నారు. ఇంటి ముందే వంటావార్పులకు దిగారు. శ్రీపర్రు వాసులు సైతం తమ ప్రాంతం లోనూ మరో 70 ఎకరాలు గతంలో లీజుకు ఇచ్చామని, దీనికి సంబంధించిన లీజు దాదాపు రెండు కోట్లకు పైగా తమకు చెల్లించాలంటూ కోమటి లంకవాసులకు తోడయ్యారు. అప్పట్లో లీజుకు తీసుకునే ముందు బెదిరించి మరీ ఒత్తిడి చేసి చెరువులు తీసుకున్నారని, లీజు సొమ్ము ఇవ్వడానికి అనేక కొర్రీలు పెడుతున్నారని లంక గ్రామాల ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. వాస్తవానికి కొల్లేరు ఐదవ కాంటూరు దిగువ, ఎగువ అనేక భాగాల్లో దిగువున ఎలాంటి చెరువులు తవ్వడానికి వీల్లేదు. అయినా సరే మసిపూసి మారేడు కాయ చేశారు. తవ్వకానియ్యే ఖర్చులను భరిస్తే ఆ తవ్విన మొత్తం విస్తీర్ణంలో చేపలను సాగు చేస్తామని, లీజు చెల్లిస్తామన్నట్టుగా అప్పట్లో అబ్బయ్యచౌదరి వర్గం వ్యవహరించిందని కొందరి వాదన. ఇప్పుడది కాస్తా లీజుసొమ్ము రూపంలో బయటపడింది. తాము తవ్విన చెరువులన్నీ పట్టా భూములేనని, అందువల్ల ముందస్తు అగ్రిమెంట్ ప్రకారం లీజు చెల్లించాల్సిందేనన్నది లంక వాసుల వాదన.

ఇచ్చిందెంత.. ఇవ్వాల్సిందెంత..?

చెరువుల లీజు వ్యవహారం తాజాగా భగ్గుమంటోంది. ఈ వ్యవహారంలో మాజీ వైసీపీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి చుట్టూ తిరుగుతోంది. పెదవేగి మండలం కొండలరావుపాలెంలోని అబ్బయ్య చౌదరి నివాసం ఎదుట ఆందోళనకు తావిచ్చింది. వాస్తవానికి గడిచిన నాలుగేళ్లల్లో తాము లీజు రూపంలో లంకవాసులకు చెల్లించిందెంత లెక్కల రూపంలో తేల్చాలని అబ్బయ్యచౌదరి అనుకూల వర్గం గట్టిగా పట్టుపడుతోంది. తాము ఇచ్చిన దానికి ఇవ్వాలని చేస్తున్న డిమాండ్‌కు మధ్య పొంతనేలేదని అబ్బయ్య వర్గం ఉంది. కాని తమకు అగ్రిమెంటుపరంగా ఇవ్వాల్సిన లీజు మొత్తం ఇంకా రూ.ఆరు కోట్లు ఉందని కోమటి లంక వాసులు, శ్రీపర్రులో రెండు కోట్లు మొత్తం మీద ఎనిమిది కోట్లు బకాయిలు ఉన్నట్టుగా వాదనలు వినిపిస్తున్నారు. గడిచిన మూడు నెలల క్రితం అబ్బయ్యచౌదరి ఇంటి ముందు నిరసనకు దిగేందుకు ప్రయత్నించారు. అధికారం కోల్పోయిన తర్వాత ఆయన లండన్‌లోనే ఉంటున్నారు. అయినా ఈ రెండు గ్రామస్థులు పట్టువీడకుండా ఆందోళన కొనసాగిస్తామని ప్రకటించారు.



కొఠారు ఇంటి ఎదుట శనివారం బైఠాయించిన లంక గ్రామాల వాసులు (ఫైల్)

చింతమనేని కుట్రతోనే నాపై అసత్య ఆరోపణలు

మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదవేగి : 'దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కుట్ర కారణంగానే టీడీపీ నేతలు నాపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు' అంటూ దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆరోపించారు. కోమటిలంక, శ్రీపర్రు గ్రామస్థులను బెదిరించి, మా ఇంటిపైకి పంపించారన్నారు. ఈ మేరకు ఆయన లండన్ నుంచి ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రశాంతంగా ఉండే లంక గ్రామాల్లో చింతమనేని సమస్యలు సృష్టిస్తున్నారన్నారు. కొల్లేరులో ఒక్క ఎకరం భూమి నాపేరు మీద ఉందని నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా దూరంగా ఉంటానన్నారు. నేను సొమ్ములు ఇవ్వాలని ఆరోపిస్తున్న వారు నా దగ్గరకు వచ్చి ఎప్పుడైనా మాట్లాడవచ్చన్నారు. కోమటిలంక, శ్రీపర్రు గ్రామాల అభివృద్ధికి తాను రూ.70 కోట్ల వ్యయం చేశానన్నారు. ప్రభుత్వం మారిన దగ్గరనుంచి దెందులూరు నియోజకవర్గంలో టీడీపీ వర్గీయులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలపై భౌతిక దాడులు చేస్తూ, ఆస్తుల ధ్వంసానికి పాల్పడుతున్నారని ఆరోపించారు.

నేడు యథావిధిగా నిరసన కొనసాగింపు ..

దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఇంటి దగ్గర శుక్ర, శనివారాలు రెండురోజులపాటి నిరసనలు, ఆందోళనలు చేసిన కోమటిలంక, శ్రీపర్రు గ్రామస్థులు ఆదివారం విరామం ప్రకటించారు. తిరిగి సోమవారం నుంచి ఆందోళనను యథావిధిగా కొనసాగిస్తామని తెలిపారు. ఆదివారం కావడంతో విరామం ఇచ్చామని, దీనిని మంచి ఆలోచనకు అవకాశంగా భావించి మా సొమ్ము ఇచ్చేలా ఆలోచన చేయాలని వారు అబ్బయ్యచౌదరికి సూచించారు.



ముదినేపల్లి ప్రాంతంలో రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం

వాతావరణం

రైతుల ఆందోళన.. దయనీయంగా ధాన్యం అమ్మకాలు

కలిదిండి/ముదినేపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పులతో ఆకాశం మేఘావృతమై ఉండడంతో ఏ క్షణంలో భారీ వర్షం కురుస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కలిదిండి మండలం కోరుకొల్లు, సానారుద్రవరం, గోపాలపురం, వెంకటాపురం గ్రామాల్లో 100 టన్నుల ధాన్యపు రాశులు కల్లాల్లో ఉన్నాయి. సుమారు 300 ఎకరాల్లో వరి పంట కోత దశలో ఉంది. ఈ పరిస్థితుల్లో భారీ వర్షం కురిస్తే రైతులకు తీవ్ర నష్టం తప్పదు. రైతులు ఉరుకులు పరుగులతో కల్లాల్లో ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా మిల్లర్లకు, సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. చేపల రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ కొరత నివారణకు చెరువుల్లో నిరంతరాయంగా ఏరియేటర్లు తిప్పుతుండడంతో పాటు ఆక్సిజన్ టాబ్లెట్స్‌ను ఉపయోగిస్తున్నారు. ముదినేపల్లి మండలంలో పెద్ద ఎత్తున ధాన్యం అమ్మకాలకు నిల్వ ఉండటం, తేమ శాతం తగ్గించి గిట్టుబాటు ధర పొందేందుకు రైతులు చేస్తున్న ప్రయత్నాలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ప్రధాన రహదారుల వెంబడి ఎక్కడ చూసినా నిల్వ ఉంచిన ధాన్యం రాశులు, ఆరబెట్టిన ధాన్యం దృశ్యాలే కనిపిస్తున్నాయి. మండలంలో సుమారు 3 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం అమ్మకాలకు సిద్ధంగా ఉండగా, మరో 4 వేల ఎకరాల్లో వరి పైరు కోతకు సిద్ధంగా ఉంది. ఈ పరిస్థితుల్లో ధాన్యం అమ్మకాలు దయనీయంగా మారింది.



సానారుద్రవరంలో హడావిడిగా ధాన్యాన్ని తరలిస్తున్న రైతులు

నేటినుంచి ఎస్ఏ-1 పరీక్షలు

ఏలూరు అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యార్థులకు సోమవారం నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ టర్మ్-1 (పూర్వపు విధానంలో అర్ధసంవత్సర) పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. 19వ తేదీ వరకు కొనసాగుతాయి. ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలలు, 9,10 తరగతులకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించడానికి ఇప్పటికే ఎస్సీఈఆర్టీ టైం టేబుల్‌ను విడుదల చేసింది. జిల్లాలో మొత్తం 1.50 లక్షల మంది బాల బాలికలు హాజరు కావాల్సి ఉంది. పరీక్షలు ముగిసిన మూడు రోజుల్లోగా మూల్యాంకనాన్ని సంబంధిత పాఠశాలల్లోనే పూర్తిచేసి విద్యార్థుల మార్కులను సీఎస్ఈ వెబ్‌సైట్‌లో నమోదు చేయా ల్సి ఉంటుంది. ఈ పరీక్షల కోసం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణను ఈ నెల 20, 21 తేదీలకు వాయిదా వేశారు.

నేడే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల..

ఓట్ల లెక్కింపు

- కాకినాడ జేఎన్‌టీయూకేలో ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభం..
- 14 టేబుళ్లు.. 9 రౌండ్లు



కాకినాడ జేఎన్‌టీయూలో ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు కోసం చేసిన ఏర్పాట్లు

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఆర్వో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 5న తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గం సంబంధించిన పోలింగ్ ప్రక్రియ జరిగిందన్నారు. ఈ పోలింగ్ ప్రక్రియలో 15,490 ఓట్లు నమోదయ్యా యన్నారు. బ్యాలెట్ బాక్సులను కాకినాడ జేఎన్‌టీయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీ గ్రౌండ్ ఫ్లోర్‌లో భద్రపరిచామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సోమవారం ఉదయం 8గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు. కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తి చేశామన్నారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు ఉదయం 6గంటలకే కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. 14 టేబుళ్లపై 9రౌండ్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శ కాలు దృష్టిలో పెట్టుకుని ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. తొలిదశలో ప్రాథమిక ఓట్ల లెక్కింపు పూర్తయిన అనంతరం డీటెయిల్డ్ కౌంటింగ్ నిర్వహించామన్నారు.

కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

కాకినాడ క్రైం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను ఎస్పీ విక్రాంత్ పాటిల్ కాకినాడ జేఎన్‌టీయూకేలో ఆదివారం పరిశీలించారు. ఇన్, అవుట్ గేట్ల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టాలని కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణును ఆదేశించారు. ఎలక్షన్ అధికారులు, పోలింగ్ ఏజెంట్ల సెల్‌ఫోన్లను బయట సెల్‌ఫోన్ కౌంటర్లలో జమ చేసి లోనికి వెళ్లాలని సూచించారు. కౌంటింగ్ నిర్వహించే భవనాల పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలను వినియోగిస్తూ పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆయన వాహనాల పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. జేఎన్‌టీయూకే ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో వాహనాలను పార్క్ చేసి కౌంటింగ్ కేంద్రాల్లోకి వెళ్లాలని ఎస్పీ కోరారు. ఆయన వెంట ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు, సర్పవరం సీఐ బి.పెద్దిరాజు, ట్రాఫిక్-2 సీఐ డి.రామారావు ఉన్నారు.

గెలిచేదెవరు?

- ఎమ్మెల్సీ ఫలితాలపై ఉత్కంఠ
- గోపిమూర్తికి బలంగా పనిచేసిన యూటీఎఫ్
- గతంలో పోటీచేసిన గంధం నారాయణరావు
- వీరిద్దరి మధ్యే ప్రధాన పోటీ అని ప్రచారం

7

- ఫలితాలపై జోరుగా బెట్టింగ్‌లు

'నన్' శిక్షణకు వచ్చిన బాలిక ప్రసవం

8

పింఛన్..లెక్కలు

- నేడు రాష్ట్రవ్యాప్తంగా ప్రయోగాత్మకంగా సామాజిక పింఛన్ల తనిఖీలు
- అర్హులెవరు.. అనర్హులెవరో తేల్చే యత్నం
- జిల్లాలో ఆగిరిపల్లి మండలం సూరవరం ఎంపిక
- ఇతర మండలాలకు చెందిన సిబ్బందితో తనిఖీలు

ఏలూరు సిటీ, డిసెంబరు 8 : రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్‌ల తనిఖీలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దివ్యాంగులు, ఇతర కేటగిరీల్లో అనర్హులు లబ్ధి పొందుతున్నారని ఫిర్యాదులు రావడంతో చర్యలకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా పింఛన్‌ల తనిఖీ ప్రక్రియ నిర్వహించాలనే ఉద్దేశ్యంతో ప్రతి జిల్లాలోని ఒక మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి రెండు రోజుల్లో లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి తనిఖీలు చేపట్టాలని నిర్ణయించింది. ఇతర మండలాలకు చెందిన సిబ్బందితో ఈ తనిఖీలు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా జిల్లాలోని ఆగిరిపల్లి మండలం సూరవరం గ్రామాన్ని ఎంపిక చేశారు. ఈ గ్రామంలో 423 పింఛన్ లబ్ధిదారులున్నారు. ఈ పింఛన్‌లను తనిఖీ చేయడానికి 20 మంది సిబ్బందిని నియమించారు. సోమవారం ఒక్క రోజులోనే ఈ తనిఖీలు చేయనున్నారు. నూజివీడు, ముసునూరు మండలాలకు చెందిన ఎంపీడీవోలతో పాటు ఇతర సచివాలయ సిబ్బంది తనిఖీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రయోగాత్మకంగా చేపడుతున్న ప్రక్రియలో వచ్చిన ఫలితాలు ఆధారంగా మిగిలిన గ్రామాల్లోను కొనసాగించే అవకాశం ఉంది. ఎన్నికలలో ఇచ్చిన హామీని అనుసరించి ఈ ఏడాది ఏప్రిల్ నుంచే పింఛన్‌ల మొత్తాలను కూటమి ప్రభుత్వం పెంచింది. గత ప్రభుత్వం విడతలు విడతలుగా పింఛన్ మొత్తాలను పెంచి లబ్ధిదారులకు అందించగా జూన్‌లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం జూలై 1వ తేదీన మూడు నెలలు ఏరియర్స్‌తో కలిపి పింఛన్ మొత్తాలను అందించింది. వివిధ కారణాల వల్ల గత వైసీపీ ప్రభుత్వం అర్హులైన వారికి పింఛన్‌లను ఆపివేసింది. దీంతో ఐదేళ్ల నిరీక్షణ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అర్హులైన లబ్ధిదారులు, గత ప్రభుత్వ హయాంలో అర్హత ఉండి పింఛన్‌లు పొందనివారు పింఛన్ కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు. మరోవైపు పింఛన్ మొత్తాలను ఒకేసారి భారీగా పెంచడంతో అర్హులతో పాటు అనర్హులు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా సదరం సర్టిఫికెట్ల విషయంలో విభిన్న ప్రతిభావంతులలో అనర్హులు తమకున్న వికలాంగత్వ శాతాన్ని పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే గత ప్రభుత్వ హయాంలో ఇష్టానుసారంగా పింఛన్లు మంజూరు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణ పింఛన్ల తనిఖీలే చెబుతున్నా లబ్ధిదారులలో అనర్హులుంటే వారి పింఛన్ల పరిస్థితి ఏమిటో తనిఖీలు తర్వాత తెలిసే అవకాశం ఉంది.



చిన వెంకన్నకు భక్తుల తాకిడి

ద్వారకాతిరుమల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల చిన్నతిరుమలేశుని క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో సుమారు 12 వేల మందివరకూ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలోని అన్ని విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. కొండపై పార్కింగ్ ప్రాంతం కార్లు, వాహనాలతో నిండింది.



గుబ్బల మంగమ్మకు పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గుబ్బల మంగమ్మతల్లిని దర్శించుకోడానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఏజెన్సీకి చేరుకున్నారు.వాతావరణంలో మార్పులు కారణంగా భక్తులను ఆలయ కమిటీ వారు సాయంత్రం 3 గంటల దాటిన వెంటనే ఇళ్లకు పంపించి వేశారు.



పుట్టింటికి వచ్చిన అమ్మవారు

పెదవేగి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పెదవేగి మండలం కూచింపూడిలో వెలగలమ్మ చెరువు వద్ద కొలువై ఉన్న గంగానమ్మని ఆదివారం ఉదయం ఊరేగింపుగా గ్రామానికి తీసుకొచ్చి రామాలయం దగ్గర నిలబెట్టారు. 12 రోజులపాటు పూజలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఫిబ్రవరి నెలవరకు జాతర పూజలు ఉంటాయని చెప్పారు.



పేరుపాలెం బీచ్‌లో సందడి

మొగల్తూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కేపీ పాలెం, పేరుపాలెం సాగర తీరాలు ఆదివారం సందర్శకులతో కళకళలాడాయి. కార్తీక మాసం ఆఖరి ఆదివారం తుఫాన్ కారణంగా సందర్శకులను అనుమతించలేదు. వారం రోజులుగా వాతావరణం అనుకూలించడంతో ఉదయం నుంచి పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు విచ్చేశారు..



అపూర్వ కలయిక

కాళ్ళ, డిసెంబరు 8, (ఆంధ్రజ్యోతి): 25 ఏళ్ళ క్రితం చదువుకున్న విద్యార్థులు కలుసుకున్నారు. కాళ్ళ హైస్కూల్‌లో 1999-2000 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు సుమారు 170 మంది పూర్వ విద్యార్థులు వారి వారి పిల్లలు, కుటుంబ సభ్యులతో విచ్చేశారు.. సాయంత్రం ఆటపాటలతో సంతోషంగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేద్దామని తీర్మానాలు చేసుకున్నారు.

భగవద్గీత పోటీల్లో సాత్విక్ కు ద్వితీయ బహుమతి



భీమవరం టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విశ్వహిందూ పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి భగవద్గీత కంఠస్థ పోటీలల్లో భీమవరం గునుపూడి ఉమా సోమేశ్వర భగవద్గీత సమాజానికి చెందిన వేలూరి సీతారామ సుబ్రహ్మణ్య శివసాయి సాత్విక్‌కు ద్వితీయ బహుమతి లభించింది. 25న విజయవాడ విశ్వహిందూ పరిషత్ రాష్ట్రశాఖ నిర్వహించే పోటీల్లో పాల్గొనేందుకు సాత్విక్ అర్హత సాధించారు. సాత్విక్‌ను యామిజాల ఉమా సోమేశ్వర శర్మ తదితరులు అభినందించారు.

కేంద్ర మంత్రికి యూత్ హాస్టల్ జీవిత సభ్యత్వ కార్డు



భీమవరం టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : యూత్ హాస్టల్ జీవిత సభ్యత్వ కార్డును ఆదివారం భీమవరంశాఖ యూత్ హాస్టల్ సభ్యులు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మకు అందజేశారు. ఈనెల 15న జరిగే యూత్ హాస్టల్ జాతీయ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా మంత్రి వర్మ పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు. యూనిట్ ఛైర్మన్ మట్లపూడి సత్యనారాయణ, జానపాటి మధుసూధనరావు, పేరిచర్ల లక్ష్మణవర్మ, కంతేటి వెంకట్రాజు, సరిపిడకల రామారావు, కుక్కల బాల వెంకట రత్నం, కడలి వెంకటేశ్వరరావు, తాళ్ళపూడి గాంధీ పాల్గొన్నారు.

15న సినిమా పాటల పోటీలు

ఆకివీడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సరిగమ.. పాడుతా హాయిగా ద్వారా ఎంతో మంది గాయకులు, కళాకారులను సినీ పరిశ్రమకు పరిచయం చేసినట్టు సరిగమ సంగీత పరిషత్ వ్యవస్థాపకుడు సింగవరపు కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆకివీడు సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 15న స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మందిరంలో సరిగమ పాడుతా హాయిగా 25వ రాష్ట్రస్థాయి సినిమా పాటల పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉభయ రాష్ట్రాల సినీ ప్రముఖులకు సరిగమ జీవన సాఫల్య పురస్కారాలు అందజేస్తామన్నారు. ప్రముఖులకు సరిగమ అభినందన పురస్కారాలు, సినీ, తదితర వాటిలో సేవలందించిన వ్యక్తులకు సరిగమ రజతోత్సవ సత్కారాలు ఉంటాయన్నారు. సినీహాస్య నటులచే స్కిట్స్ ఉంటాయన్నారు. సిల్వర్ జూబ్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కలిగించాలి

పెనుగొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తి చేసి స్వయం ప్రతిపత్తి కలిగిన ఒక ఉత్తమ ధార్మిక వ్యవస్థకు అప్పగించాలని సద్గురు గీతాశ్రమ పీఠాధిపతి పూజ్యశ్రీ సత్యానందగిరి స్వామీజీ పేర్కొన్నారు. పెనుగొండ మండలం సిద్ధాంతం విజయ గోపాలస్వామి దేవస్థానంలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో సంఘ మండల హిందూ సమ్మేళనం నిర్వహించారు. హిందూత్వానికి అలవా లమైన దేవాయాలకు నేడు రక్షణ లేకుండా పోయిందన్నారు. విగ్రహాలు ధ్వంసానికి గురవు తున్నాయన్నారు. దేవాలయాల్లో దూప దీప నైవేద్యం మరియు కంకైర్యాలు కరవతున్నాయన్నారు. దేవాలయాల్లో పనిచేస్తున్న అన్యమత ఉద్యోగులను తొలగించాలని డిమాండ్ చేశారు. హిందు విజయవాడలోజనవరి 5న తలపెట్టిన హైందవ శంఖారావం జయప్రదం చేయాలన్నారు.



పాఠశాల విద్య ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లాశాఖకు ఎన్నికైన నాయకులు, తదితరులు

పాఠశాల విద్యాశాఖ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గం

ఏలూరు అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్య సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాశాఖ ఎన్నికలు ఆదివారం ఏలూరులో జరిగాయి. సంఘ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వి.క్రాంతి కిరణ్, పి.కుమారస్వామి ఎన్నికయ్యారు. సహ అధ్యక్షుడిగా ఎం.పవన్‌కుమార్, కోశాధికారిగా ఎం.వంశీకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఐ.సుధాకర్, మహిళా విభాగం కార్యదర్శిగా ఝాన్సీరాణిలను ఎన్నుకున్నారు. వీరితో పాటు ఉపాధ్యక్షులుగా ఐదుగురిని, జాయింట్ సెక్రటరీలుగా ఐదుగురిని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంతో సంఘ రాష్ట్ర అధ్యక్షులు పద్మకుమారి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ప్రమాణస్వీకారం చేయించారు. ఎన్నికల అధికారులుగా కె.రాజకుమారి, టి.శ్రీనివాస్ వ్యవహరించారు. సంఘ రాష్ట్ర నాయకులు హుస్సేన్, ఏ.శ్యామ్యూల్, కె.ఎస్.ఆర్.మోహన్ తదితరులు పాల్గొన్నారు

భయపెడుతున్న రక్తపింజరులు





ఆకివీడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు పాత్రికేనగర్‌లో రక్తపింజర్లు భయపెడుతున్నాయి. ఆదివారం రైతులు రక్తపింజరను చంపారు. పాదులో ఉండడాన్ని గమనించిన స్థానికులు రైతులతో కలిసి చంపారు. ఈ ప్రాంతం సమీపంలో పొలాలు, ఆక్వా చెరువులు, కాలువలు ఉండడంతో నిత్యం జనసంచారం ఉంటుంది. రైతులు పాకలు ఏర్పాటు చేసుకొని పశువులను పెంచుతుంటారు. రాత్రులు కూడా తిరుగుతారు. ఇటువంటివి వారానికోకసారి జరుగుతుండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు





రన్‌లో పాల్గొన్న విద్యార్థులు..విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

పరుగు, నడక ఆరోగ్యానికి మంచిది : ఎమ్మెల్యే ఆరిమిల్లి

ఇరగవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పరుగు, నడక ఆరోగ్యానికి ఎంతో మంచిదని, కేవలం శరీరానికి మాత్రమే కాకుండా మెదడుకు కావలసి శక్తిని ఇస్తుందని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. తణుకు పట్టణంలో ఆదివారం 'ఊరు మన పరుగు' పేరుతో రన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ప్రారంభమై రాష్ట్రపతి రోడ్డు, వేల్పూరి రోడ్డు మీదుగా సాగింది. 3కె, 4కె, 10కె రన్ విభాగంలో విశ్వతేజ నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

గ్రామాలే నాటక రంగానికి పుట్టినిళ్లు

జాతీయ నాటక పోటీలను ప్రారంభించిన సినీనటుడు శుభలేఖ సుధాకర్



(వీరవాసరం) భీమవరం టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పూర్వం గ్రామాలే నాటక రంగానికి పుట్టినిళ్ళు అని, తరువాత పట్టణాలకు ఈ కళారంగం చేరిందని, ప్రస్తుతం ఎక్కడా నాటక రంగాన్ని ఆదరించే పరిస్థితులు లేక పోయినా ఈ ప్రాంతంలో నాటకరంగాన్ని పరిరక్షించడానికి కృషి చేయడం అభినందనీయమని సినీ నటుడు శుభలేఖ సుధాకర్ అన్నారు. వీరవాసరం మండలం తోలేరులో సుబ్రహ్మణ్యేశ్వర కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 20వ జాతీయ స్థాయి నాటిక పోటీల ప్రారంభోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆదివారం కళాపరిషత్ అధ్యక్షుడు చవాకుల సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో నాటక కళారంగాన్ని ఇంతిలా ఆదరించడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, భీమవరం చైతన్య భారతి కళాపరిషత్ అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్, వాఖ్యత దాయన సురేష్ చంద్రాజీ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పోలిశెట్టి సత్యనారాయణ (దాసు) పాలకొల్లు కళాపరిషత్ వ్యవస్థాపకుడు మానాపురం సత్యనారాయణ, వీరవాసరం కళా పరిషత్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ, శ్రీకృష్ణదేవరాయ నాట కళాపరిషత అధ్యక్షుడు కేఎస్ ఆర్కే. గోపాలకృష్ణ, తక్కెళ్ళ సత్యనారాయణ, తమ్మినీడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.





అలంకరించిన వాహనంపై స్వామివారిని గ్రామోత్సవం నిర్వహించారు.

నేత్రపర్వంగా అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వరుడి ఊరేగింపు



అత్తిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అత్తిలి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాలలో భాగంగా స్వామి ఊరేగింపు నేత్రపర్వంగా జరిగింది. బుట్టబొమ్మలు, బేతాళ నృత్యాలు, కోలాట భజనలు, రామదండు, కేరళా నృత్య ప్రదర్శనలు, తీన్‌మార్ డప్పులు, విచిత్ర వేషధారణల నడుమ ప్రత్యేకంగా

గెలిచేదెవరు..?

- ఎమ్మెల్సీ ఫలితాలపై ఉత్కంఠ
- గోపిమూర్తికి బలంగా పనిచేసిన యూటీఎఫ్
- గత ఎన్నికల్లోనూ పోటీచేసిన గంధం నారాయణరావు
- వీరిద్దరి మధ్యే ప్రధాన పోటీ అని ప్రచారం
- ఫలితాలపై జోరుగా బెట్టింగ్‌లు

నిడమర్రు డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజ కవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. సోమవారం ఫలితాలు విడుదల కానున్నాయి. మొత్తం తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కాకినాడ, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని 116 పోలింగ్ కేంద్రాల్లో 5న జరిగిన ఎన్నికల్లో 92.62 శాతం పోలింగ్ నమోదైంది. 16,737 మంది ఓటర్లకు గాను 15,502 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పనిచేసిన షేక్ సాబ్జీ గతేడాది ఆకివీడు వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. సాబ్జీ వారసుడుగా తెర మీదకు వచ్చిన యూటీఎఫ్ నాయకుడు భీమవరానికి చెందిన బొర్రా గోపిమూర్తి పోటీలో ఉన్నారు. పది సంవత్సరాల సర్వీసు వదులుకుని రాజీనామా చేసి ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలబడగా మరోపక్క మిగిలిన 16 ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన గంధం నారాయణ రావు పోటీలో నిల్చారు. ఐదుగురు అభ్యర్థులు పోటీలో నిలవగా ప్రధానంగా పోటీ మాత్రం వీరిద్దరి మధ్యే ఉంది. సాబ్జీ వారసుడిగా ముందుకు వచ్చిన గోపిమూర్తికి యూటీఎఫ్ అండగా నిలబడింది. ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. అధిక శాతం ప్రభుత్వ పాఠశాలలు ఉపాధ్యా యులే నమోదు చేసుకోగా ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులు పెద్దగా నమోదు చేసుకోలేదని మొత్తం ఓట్లలో వారివి మూడు వేలే ఉంటా యని అంచనా వేస్తున్నారు. ఇది కూడా గోపిమూర్తి విజయానికి అవకాశాలు ఉన్నట్టు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరోపక్క గంధం నారాయణరావు విజయంపై ఆయా సంఘాల నాయకులు పూర్తి విశ్వాసంతో ఉన్నారు. అన్ని ఉపాధ్యాయ సంఘాల మద్దతు నారాయణ రావుకు ఉండడం ఆయనకు కలిసొచ్చే అంశం. కార్పొరేట్ విద్యాసంస్థల ఉపాధ్యాయులు, ప్రైవేటు విద్యాసంస్థల ఓటర్లు ఈయనకు అనుకూలంగా చేశారని ప్రచారం జరుగుతు తోంది. ఓసీ కార్డును ఆయన వర్గీయులు బలంగా నమ్ముకొన్నారు. గతంలో కూడా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఆయన పోటీ చేయడం, ఓటర్లు అందరికీ సుపరిచరితుడు కావడం కలిసొచ్చే అంశంగా భావిస్తున్నారు..

ఫలితాలపై జోరుగా పందేలు

పందెం ఎమ్మెల్సీ ఫలితాలపై కూఆ జోరుగా పందేలు కాశారు. ఎన్నికల ప్రారంభ సమయంలో గోపిమూర్తి - గంధం నారాయణ రావుల మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని ఆది నుంచి ప్రచారం జరుగు తోంది. మొదట్లో గోపిమూర్తి గెలిస్తే లక్ష రూపాయలు, గంధం నారాయణరావు గెలిస్తే లక్షా 50 వేలు ఇవ్వాల్సి ఉంటుందని పందేలు జోరుగా జరిగాయి. డిసెంబరు 5న ఎన్నికల సరళి చూసిన తర్వాత పందేల సరళి కూడా మారిపోయింది. గోపిమూర్తి మరింత హెచ్చు లోకి వెళ్లినట్లు పందెం రాయుళ్ల వద్ద సమాచారం. దీంతో పందేలు ఒకటికి మూడు రెట్లు అన్నట్టు కాస్తున్నారు. గోపిమూర్తి గెలిస్తే లక్ష, గంధం నారాయణరావు గెలిస్తే 2 లక్షల నుంచి 3 లక్షల వరకు ఇవ్వాల్సి ఉంటుందని పందేలు కాస్తున్నారు. సోమవారం సాయంత్రం 3 గంటల నాటికి ఫలితాలపై ఓ స్పష్టత రావచ్చని విశ్లేకులు చెబుతున్నారు.

హోరాహోరీగా బాస్కెట్ బాల్ పోటీలు



పెనుమంట్ర, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మార్టేరులో బాస్కెట్ బాల్ అంతర్ జిల్లాల పోటీలు ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. పురుషుల విభాగంలో విశాఖపట్నం -నెల్లూరు మధ్య జరిగిన పోటీలో విశాఖపట్నం గెలుపొందింది. అనంతపురం-శ్రీకాకుళం జట్ల మధ్య జరిగిన పోటీలో అనంతపురం గెలుపొందింది. గుంటూరు -కడప జట్ల మధ్య జరిగిన పోటీలో గుంటూరు గెలుపొందింది. కృష్ణా - విజయవాడ జట్ల మధ్య జరిగిన పోటీలో కృష్ణా జిల్లా, చిత్తూరు- కర్నూలు మధ్య జరిగిన పోటీలో చిత్తూరు గెలుపొందింది. మహిళల విభాగంలో కృష్ణ- కర్నూలు జట్ల మధ్య జరిగినపోటీలో కృష్ణా జిల్లా విజయం సాధించగా పశ్చిమగోదావరి ప్రకాశం జట్ల మధ్య జరిగిన పోటీలో పశ్చిమ గోదావరి జిల్లా విజయం,తూర్పుగోదావరి - కడప జిల్లాల మధ్య జరిగిన పోటీల్లో తూర్పు గోదావరి జిల్లా విజయం సాధించింది. చిత్తూరు జిల్లా- శ్రీకాకుళం జిల్లా మధ్య జరిగిన పోటీల్లో చిత్తూరు గెలుపొందింది. విశాఖపట్నం- కర్నూలు పోటీలో విశాఖపట్నం గెలుపొందింది. పశ్చిమగోదావరి జిల్లా శ్రీకాకుళం జట్టు మధ్య జరిగిన పోటీలో పశ్చిమ గోదావరి గెలుపొందింది. నేడు సెమీ ఫైనల్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

క్రైమ్ కార్నర్

రెండు బైక్‌లు ఢీ.. ఒకరి మృతి



సానబోయిన రమేష్ (ఫైల్)

భీమవరం క్రైం,డిసెంబరు 8, (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందినట్టు భీమవరం రూరల్ ఎస్‌ఐ వీర్రాజు తెలిపారు. భీమవరం మండలం వెంప గ్రామానికి చెందిన సానబోయిన రమేష్ (35), కపురు వాసు, మరో ఇద్దరు స్నేహితులు కలసి శనివారం రాత్రి రెండు బైక్‌లపై భీమవరం సినిమాకు వస్తున్నారు.యమునాపల్లి గ్రామం వద్దకు వచ్చేసరికి జుత్తిగ వెంకటేశ్వరరావు అనే వ్యక్తి తన భార్యతో కలసి ద్విచక్ర వాహనంపై భీమవరం నుంచి వెంప వైపు వెళుతున్నారు. ఈ రెండు బైక్‌లు ఢీకొనడంతో సానబోయిన రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. వెనుక ఉన్న వాసుకు స్వల్ప గాయాలయ్యాయి. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించి కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

బైక్, ఆటో తగుల బెట్టారంటూ ఫిర్యాదు

భీమవరం క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజోతి): తన ఇంటికి ముగ్గురు వ్యక్తులు వచ్చి తలపై కొట్టి, ఇంటి ముందు ఉన్న బైక్, ఆటోను తగలబెట్టారంటూ బీసీ కాలనీకి చెందిన గేదెల లక్ష్మణరావు టూటౌన్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. లక్ష్మణరావు తన కుటుంబంతో శనివారం రాత్రి నిద్రపోయారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో బొల్లా కృష్ణ, బొల్లా రాము, బొల్లా శంకర్ అనే వారు ఇంటికి వచ్చి తలుపులు కొట్టారు. తలుపు తీసిన వెంటనే తలపై ఇనుప రాడ్డుతో కొట్టి ఆటో, బైక్‌పై పెట్రోల్ పోసి తగలబెట్టినట్లు ఫిర్యాదు చేశాడు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రహ్మాన్ తెలిపారు.



వివరాలు తెలుపుతున్న భీమవరం డీఎస్పీ జయసూర్య

అంతర్ జిల్లాల దొంగ అరెస్ట్
124 గ్రాముల బంగారం, అరకేజీ వెండి స్వాధీనం

భీమవరం క్రైం, డిసెంబరు 8, (ఆంధ్రజ్యోతి) చెడు వ్యసనాలకు బానిసైన ఒక వ్యక్తి 20 ఏళ్లుగా దొంగతనాలు చేస్తున్నాడు. ఆదివారం భీమవరం రెండవ పట్టణ పోలీసులకు ఒక క్లబ్ వద్ద ఖాళీ ప్రదేశంలో పట్టుబడ్డాడు. ఆదివారం రాత్రి విలేకరుల సమావేశంలో భీమవరం డీఎస్పీ జయసూర్య వివరాలు వెల్లడించారు. పెంటపాడు మండలం చింతపల్లి గ్రామానికి చెందిన ఖండవల్లి సీతారాముడు పేకాట, తాగుడు వంటి చెడు వ్యసనాలకు బానిసయ్యాడు.డబ్బుల కోసం తాళాలు వేసి ఉన్న ఇళ్ళలోనూ, రోడ్డు పక్కన ఉన్న షాపుల్లోనూ చోరీలు చేయడం అలవాటు చేసుకున్నాడు. గణపవరం, పెదపాడు, రావులపాలెం, అత్తిలి, పెంటపాడు పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు దొంగతనాలు చేశాడు. ఈ ఏడాది జూన్ నెలలో భీమవరం ఏఎస్ఆర్ నగర్ చింతలపాటి వెంకట సత్యనారాయణరాజు ఇంట్లో చోరీ చేశాడు. ఆగస్టులో పాలకోడేరు మండలం గొల్లలకోడేరు గ్రామంలో అర్ధరాత్రి సమయంలో దోపిడీ చేశాడు. అదే నెలలో భీమవరం బలుసుమూడి ఏరియాలో డి.వెంకటేశ్వరరావు ఇంటి తాళాలు బద్దలుకొట్టి బంగారం, నగదు దోచుకున్నాడు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో భీమవరం ఆదర్శ్ నగర్‌లో దండు రంగరాజు ఇంట్లో బంగారం, వెండి దోచుకున్నాడు. కొన్ని రోజుల క్రితం రావులపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాలు చెయ్యగా జూలై నెలలో అరెస్ట్ చేసి జైలుకు పంపారు. ఆ కేసులో బెయిల్‌పై బయటకు వచ్చి మళ్లీ అత్తిలి పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనానికి పాల్పడగా అత్తిలి పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపించగా బెయిల్‌పై బయటకు వచ్చి ఆదివారం భీమవరం పోలీసులకు పట్టుబడ్డాడు. అతని వద్ద 124 గ్రాముల బంగారు వస్తువులు, అరకేజీ వెండి వస్తువులు (విలువ రూ. 8,85,000) స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. భీమవరం రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐలు రెహ్మాన్, వీర్రాజు, ఇజ్రాయిల్, సిబ్బంది గోవింద్, గోపి తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఉల్లిపాయల వ్యాపారి మృతి

కొవ్వూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు ఉల్లిపాయల లోడు ఆటోను ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరు తీవ్ర గాయాల పాలయ్యారు. తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ కె.సూర్యచంద్రం (35), శ్రీరాముల దుర్గారావు ఊరూరా తిరుగుతూ ఆటోలో ఉల్లిపాయలు వ్యాపారం చేస్తుంటారు. కొవ్వూరు మండలం పంగిడిలో ఆదివారం ఉల్లిపాయలు విక్రయించుకుని కాపవరం వైపు వస్తుండగా కాపవరం జంక్షన్‌లోని రాళ్ళమడుగు వంతెనపై నర్సీపట్నం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ముందు వెళుతున్న లారీని తప్పించబోయి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న డ్రైవర్, ఉల్లిపాయలు విక్రయిస్తున్న ఇద్దరు కిందపడిపోయారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. ఆటోడ్రైవర్ కె.సూర్యచంద్రం ఆసుపత్రిలో మృతిచెందాడు. మెరుగైన వైద్యం నిమిత్తం దుర్గారావును జీఎస్ఎల్‌కు తరలించారు. కొవ్వూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీ కూతుళ్ల మృతి

పోలవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో పోలవరం మండలం బండార్లగూడెం గ్రామానికి చెందిన తల్లీ కూతుళ్ళు మృతి చెందారు. పోలవరం మండలం బక్కబండార్లగూడెం గ్రామానికి చెందిన కురసాని కాంతమ్మ (45) కవలం గన్నమ్మ (75) ఉదయం దొండపూడి గ్రామం నుంచి కుంకాల రోడ్డులో స్కూటీపై వెళుతుండగా అదే రోడ్డులో ఎదురుగా వెళుతున్న ట్రాక్టర్‌ని ఓవర్ టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న మరో ట్రాక్టర్‌ని ఢీకొట్టి ట్రాక్టర్ కిందపడడంతో వారిద్దరి తలలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని అటుగా వస్తున్న ఆటోలో ఎల్ఎన్‌డీ పేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడి నుంచి 108 వాహనంలో వారిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కాంతమ్మ మృతి చెందగా, కాంతమ్మ తల్లి గన్నమ్మను ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ఆస్పత్రి మార్చురీకి తరలించారు. తల్లీకూతుళ్ళ మృతితో బండార్లగూడెంలో విషాదం అలుముకుంది

ఆలయంలో వసతి సౌకర్యాల బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు, చైర్మన్, ఆలయ అధికారులు

ద్వారకాతిరుమల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో భక్తులకు అందే వసతి సౌకర్యాలపై బ్రోచర్‌ను ఆదివారం గోపాలపురం, మైలవరం ఎమ్మెల్యేలు మద్దిపాటి వెంకట్రాజు, వసంత వెంకట కృష్ణప్రసాద్‌లు, ఆలయ చైర్మన్ రాజా ఎస్‌వీ సుధాకరరావు, ట్రస్టీ నివృతరావు తదితరులు ఆవిష్కరించారు. చైర్మన్ జన్మదిన వేడుకలను మైలవరంలోని చైర్మన్ స్వగృహంలో ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యేలు, ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి, ఈఈ భాస్కర్ అక్కడకు వెళ్లి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కేక్‌ను కట్ చేసి ఆయనకు తినిపించారు. పేదలకు దుప్పట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. దేవాలయ అభివృద్ధికి చైర్మన్ చేస్తున్న కృషిని ఎమ్మెల్యేలు అభినందించారు.

కార్పొరేట్ వైద్యం అందిస్తాం



సమస్యలు వింటున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రిలో కార్పొరేట్ వైద్యం అందిస్తామని ఎమ్మెల్యే చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ తన దగ్గరకు వచ్చే వారంతా ఎక్కువగా ఆరోగ్య సమస్యలతో వస్తున్నారన్నారు. పేదలు కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించు కోలేని పరిస్థితుల్లో ఉన్నారని, అందుకే ప్రభుత్వా స్పత్రిలోనే కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్య సేవలందించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ అస్తవ్యస్తపాలన వలన ప్రజారోగ్యం పడకేసిందన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ ఆస్పత్రులన్నిటిని అభివృద్ధి చేస్తుందన్నారు. బ్రోడే వెంకటరత్నం పాల్గొన్నారు.

లెక్కల టీచర్‌కు మ్యూచువల్ డిప్యుటేషన్

ద్వారకాతిరుమల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల ఎంపీయూపీ పాఠశాలలో లెక్కల టీచర్ ఎంఎస్‌వీ ముత్యాలరావును మ్యూచువల్ డిప్యుటేషన్‌పై కామవరపుకోట మండలం జలపవారిగూడెం పాఠశాలకు పంపుతూ డీఈవో వెంకట లక్ష్మమ్మ ఉత్తర్వులు జారీ చేశారు. అక్కడ పాఠశాలలో పనిచేస్తున్న లెక్కల టీచర్ ప్రసాదరావును ద్వారకాతిరుమల స్కూల్‌కు పంపారు. ద్వారకాతిరుమల పాఠశాలలో కొందరు విద్యార్థులు, తల్లిదండ్రులు టీచర్ తీరుపై ఆందోళన చేశారు. పిల్లలను కొడుతున్నారంటూ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుకు ఫిర్యాదు చేశారు. ఆయన ఉంటే పిల్లలు స్కూల్‌కు వెళ్లమంటున్నారని అంటున్నారని చెప్పారు. దీనిపై ఎంఈవో విచారణ చేశారు. డీఈవో వెంకటలక్ష్మమ్మ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. కొంత మంది విద్యార్థులు పాఠశాలకు సరిగా రావడం లేదని హోమ్‌వర్క్ వంటివి చేయడం లేదని, వారి భవిష్యత్ కోసం మందలిం చానని వివరణ ఇచ్చారు. తాను కామవరపుకోట మండలం జలపవారిగూడెం పాఠశాల ఉపాధ్యాయుడు ప్రసాదరావు మ్యూచువల్ డిప్యుటేషన్‌కు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. దీనిపై డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

రేపు ముంపు మండలాల సదస్సు

కుక్కునూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏడు ముంపు మండలాల పోలవరం నిర్వాసితుల సమస్యల పై ఈ నెల 10న వేలేరుపాడులో నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని సీపీఐ పిలుపునిచ్చింది. ఆదివారం జరిగిన సమావేశంలో మండల కార్యదర్శి ఎం.వెంకటాచారి మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మాణంతో సర్వం కోల్పోతున్న నిర్వాసితులను ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని వాపోయారు. సర్వేల సాకుతో పరిహారం ఇవ్వకుండా అటూ ప్రభుత్వం ఇటూ అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. పి.లక్ష్మయ్య, కే.బాబురావు తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి ధనుర్మాసోత్సవాలు

ద్వారకాతిరుమల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల క్షేత్రంలో ఈనెల 16 నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ ఈఓ ఎన్వీ సత్యన్నారాయణమూర్తి తెలిపారు. వచ్చేనెల 15 వరకూ ఉత్సవాలు జరుగనున్నాయి. ఈనెల 17 ఉదయం నుంచి నెలరోజుల పాటు ప్రతీరోజూ గోదాదేవితో కలసి స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం జరుగనుంది. అనంతరం ధనుర్మాస మండపంలో గోదాదేవితో కలసి స్వామి, అమ్మవార్లను ఉంచి ప్రత్యేక పూజలు జరపనున్నారు. అలాగే ఈనెల 17 నుంచి వచ్చేనెల 14వరకూ ఆలయంలో తెల్లవారుజామున జరుగనున్న సుప్రభాత సేవలను రద్దు చేసి వాటి స్థానంలో తిరుప్పావై నిర్వహించనున్నట్టు ఈవో వివరించారు. జనవరి 13న జరిగే గోదాదేవి కల్యాణం, 14నసంక్రాంతి, 15న కనుమ పండుగతో ధనుర్మాసం ముగుస్తుందని వివరించారు.

గజానికో గొయ్యి

» అధ్వానంగా రహదారులు » తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు



గోతులమయమైన జీలకర్రగూడెం ప్రధాన రహదారి

కామవరపుకోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుంటుపల్లిలోని జీలకర్రగూడెం ప్రధాన రహదారి నుంచి కంఠమనేనివారిగూడెం, కేఎస్ రామవరం గ్రామాలకు వెళ్లే రహదారి గోతులమయమై రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గజానికో గొయ్యి, అడుగుకో మడుగు అన్నట్టుగా నెలకొంది. వాహ నదారులు, నడిచి వెళ్లే వారు కూడా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై గులక రాళ్ళు, గోతులు, మట్టి దిబ్బలు ఉండడంతో రాకపోకలు సాగించేం దుకు ప్రజలు అసహనం వ్యక్తం చేస్తు న్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కనీసం రహదారులు కూడా సక్రమంగా లేకపోతే ఎలా అంటూ వాపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం రహదారు లను పట్టిం చుకోకపోవడంతో రోడ్లన్నీ అధ్వానం గా తయార య్యాయని, కూటమి ప్రభుత్వం, పాలకులు తగు చర్యలు తీసుకుని తక్షణమే జీలకర్రగూడెం-కేఎస్ రామవరం రోడ్డు నిర్మాణం చేపట్టాలని, జీలకర్ర గూడెం, కంఠమనేనివారి గూడెం, గద్దేవారిగూడెం గ్రామాల ప్రజలు ముక్త కంఠంతో కోరుతున్నారు.

రక్షణ లేని ఫ్యూజ్ బాక్సు



పోలవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఫ్యూజ్ బాక్సు ఎలాంటి రక్షణ లేకుండా ప్రమాదకరంగా ఉంది. ఆంజనేయస్వామి ఆలయ పరిసరాలలో వాసవీ సమేత శ్రీనగరేశ్వరస్వామి ఆలయం, లక్ష్మీగణపతి ఆలయం, సాయిబాబా ఆలయం, దత్తాత్రేయ ఆలయాలు ఉన్నాయని నిత్యం అధిక సంఖ్యలో భక్తులు చిన్న పిల్లలు, వృద్ధులు ఆలయాల దర్శనానికి వస్తుంటారని రక్షణ లేని ఫ్యూజు బాక్సు వలన ఎప్పుడు ఎలాంటి విద్యుత్ ప్రమాదం జరుగుతుందో అనే భయాందోళనలతో గడపాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఎన్నిసార్లు పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని, విద్యుత్ శాఖ సిబ్బందిని అడిగితే పంచాయతీ వారికి చెప్పమంటున్నారని,, పంచాయతీ సిబ్బందికి చెబితే విద్యుత్ శాఖ సిబ్బందికి చెప్పమంటున్నారని ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులు నంగినీడి బాలకృష్ణ అర్చకులు పైడిపల్లి ఫణికుమార్ శర్మ తదితరులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

డాక్టర్ జగన్‌మోహనరావు కన్నుమూత



ఏలూరు రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): లయనిజంలో అంతర్జాతీయ గుడ్ విల్ ఆఫ్ అంబాసిడార్ అవార్డు గ్రహీత లయన్స్ మాజీ గవర్నర్, నగర ప్రజలు దేవుడుగా ఆరాధించే డాక్టర్ యార్లగడ్డ జగన్‌మోహనరావు (85) అనారోగ్యంతో శనివారం రాత్రి చికిత్స పొందుతూ కన్నుమూశారు. హేలాపూరి లయన్స్ క్లబ్ ద్వారా 48 ఏళ్లుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విశాఖపట్టణంలో లయన్స్ కేన్సర్ ఆస్పత్రి ఏర్పాటు, విజయవాడలో బ్లడ్ బ్యాంక్, ఏలూరులో కేపీహెచ్‌ఎల్ డిగ్రీ కళాశాల నిర్మాణంలో ఆయన కృషి మరువలేది. విద్య, వైద్య సామాజిక సేవా రంగాలలో ఆయన అందించిన సేవలు అజరామరం. జగన్ మోహన్‌రావు మృతికి హేలాపూరి లయన్స్ క్లబ్, ప్రజలు, ఐఎంఏ అసోసియేషన్, మానవత సంస్థల అభినయ నృత్య భారతి, రోటరీ క్లబ్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, వివిధ రంగాల ప్రముఖులు సంతాపాన్ని వక్తం చేశారు.

అదాని ఒప్పందాలను రద్దు చేయాలి

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అదాని గ్రూపు కంపెనీల అవినీతిపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయాలని, గత రాష్ట్ర ప్రభుత్వం అదాని కంపెనీలతో చేసుకున్న అన్ని ఒప్పందాలను రద్దు చేయాలని సీపీఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మన్నవ కృష్ణచైతన్య పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఈనెల 9వ తేదీన అన్ని మండల కార్యాలయాల వద్ద ఈ మేరకు ఆందోళన నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక పరిస్థితులపై పార్లమెంటులో చర్చ జరపాలని, అధిక ధరలను అరికట్టాలని, భారతదేశంలో నిరుద్యోగం నిర్మూలించాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సూపర్-6 పథకాలను అమలు చేయాలని కోరుతూ తహసీల్దార్లకు వినతిపత్రాలను అందచేస్తామని వారు తెలిపారు.

జిల్లా కార్యదర్శిగా యామి

భారత జాతీయ మహిళా సమాఖ్య జాతీయ సమితి సభ్యురాలిగా ఏలూరు నగరానికి చెందిన ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు ఏలూరు జిల్లా కార్యదర్శిగా మన్నవ యామిని ఎన్నికైనందుకు బీకేఎంయూ ఏలూరు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. ఈనెల 6, 7, 8 తేదీల్లో దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన 22వ జాతీయ సభల్లో ఆదివారం ఈ మేరకు యామినిని ఎంపిక చేసినట్టు తెలిపారు.

దంత వైద్యశిబిరం

టి.నరసాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొర్రంపాలెంలో ఆదివారం జంగారెడ్డిగూడెం కాటన్‌దొర ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 220 మందికి సాధారణ వైద్య పరీక్షలతో పాటు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఆర్థిక సాయం

ఉంగుటూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామ టీడీపీ కార్యకర్త ప్రమాదవశాత్తు ఏలూరు కాల్వలో పడి మరణించడంతో వీరికి పార్టీ నాయకత్వం ఆర్థిక సహాయం అందించింది. ఉంగుటూరులో ఆదివారం రాత్రి జరిగిన సమా వేశానికి మండల పార్టీ అధ్యక్షుడు పి.విజయకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొని బీమా కోసం సిఫార్సు చేశామని ప్రస్తుతం మండల పార్టీ అధ్యక్షులు పాతూరి విజయకుమార్ రూ.పది వేలను అందజేస్తున్నారన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



ద్వారకాతిరుమల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్వయంభుగా సుందరగిరిపై కొలువుదీరిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయ శాశ్వత అన్నప్రసాదం ట్రస్టుకు జంగారెడ్డిగూడెంకు చెందిన నిడమర్తి నాగవిజయలక్ష్మీ ఆదివారం రూ.లక్ష విరాళం అందజేశారు. మండంలోని ఐఎస్ జగన్నాథపురంలోని ఈ ఆలయం శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయం. శ్రీవారి ఆలయ కార్యాలయంలో ఈ విరాళాన్ని జమ చేశారు. వీరికి ఆలయ అధికారులు విరాళం రసీదును, ప్రసాదాలను అందజేశారు.

కరాటేలో న్యూమాన్స్ విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

ఏలూరు రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : చిలకలూరిపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ నేషనల్ కుంగఫూ టోర్నమెంట్‌లో ఏలూరు న్యూమాన్స్ కుంగ్‌ఫూ ఇన్స్టిట్యూట్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారని మాస్టర్ రాఘవ తెలిపారు. ఎం.వంశీక, బి.సంహీత, సిహెచ్‌ఎం ఆవనీ, పూజ్యశ్రీ, టి.ఇమ్మానియేలు, జ్యోషిత్, శ్రీరాం బంగారు పతకాలు సాధించారని ఆయన తెలిపారు. ఏలూరు గాంధీ స్కూల్లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను మహిళా ఇన్‌స్పెక్టర్ సరస్వతి రాఘవ, కిడ్స్ ఇన్‌స్పెక్టర్ లిఖితశ్రీ, అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డి.రాజశిరోమణి, రిటైర్డ్ ఎస్పీ రవికుమార్, తదితరులు అభినందించారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



ద్వారకాతిరుమల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల మండలం కోడిగూడెంలో దాదాపు 50 మందికి పైబడి వైసీపీ కార్యకర్తలు ఆదివారం టీడీపీలో చేరారు. వారికి క్లస్టర్ ఇన్‌చార్జ్ రేగంటి రాంబాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గురజాల చంద్రరావు, పలువురు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



పెదవేగి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : పెదవేగి మండలం రాట్నాలకుంట రాట్నాలమ్మకి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. అమ్మవారికి ఎంతో ప్రీతిపాత్రమైన పాలపొంగలి నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పావులూరి వీరవెంకట రామసత్యనారాయణశర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. పూజా టికెట్ల విక్రయాల ద్వారా రూ.51,930లు, లడ్డూ ప్రసాదాల విక్రయాలద్వారా రూ.35,820లు, ఫోటో విక్రయాలద్వారా రూ.3,410లు ఆదాయం వచ్చిందని ఆలయ కార్య నిర్వహణాధికారి ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. అలాగే ఆలయ అభివృద్ధికి భక్తులు రూ.45,843లు విరాళాలు అందించారని ఆయన చెప్పారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఈవో సతీష్ కుమార్ తెలిపారు.

ఆధ్యాత్మికం

వైద్య భగవానునికి అభిషేకాలు



ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పవరుపేట స్టేషన్ రోడ్డులోని ధన్వంతరి వైద్య భగవానుని ఆలయం వద్ద ఆదివారం భక్తులు సామూహిక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రదిక్షణలు నిర్వహించి అర్చకుల ద్వారా రక్షాబంధనాలు కట్టించుకుని వనమూలికల తీర్థాన్ని స్వీకరించారు. సూర్య నమస్కార పూజలు జరిపారు. భక్తి సంకీర్తనలు ఆలపించి భజనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆదిశర్మ భక్తులతో పూజలు చేయించారు. సూర్యనారాయణ స్వామి నామస్మరణతో ఆలయ ప్రాంతం మార్మోగింది.

కాల భైరవస్వామి జయంతి



ఏలూరు కార్పొరేష న్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు డివిజన్లలో గల శివాలయాల ప్రాంగ ణాల్లో గల కాల భైరవ స్వామి ఉప ఆలయాల వద్ద భక్తులు విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి పుష్పార్చన జరిపారు. నిమ్మకాయల హారాలను స్వామికి అలంకరించారు. కాల భైరవాష్టమి సందర్భంగా శునకాలకు పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టి హారతులిచ్చి పలుచోట్ల పూజలు నిర్వహించారు. కాలభైరవ స్వామి వాహనం శునకం కావడంతో ఆ శునకాలకు పూజాదికాలు నిర్వహించారు.

భార్యపై కత్తితో దాడి



జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రిలో శైలజ

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భార్యభర్తల కుటుంబ కలహాల నేపథ్యంలో ముప్పి డి రామకృష్ణ అనే వ్యక్తి తన భార్య శైలజను విచ క్షణా రహితంగా కత్తితో నరికిన ఘటన ఆదివారం జంగారెడ్డిగూడెం పట్టణంలో కలకలం సృష్టించిం ది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలు ఇ లా ఉన్నాయి. ఎస్వీపేటకు చెందిన రామకృష్ణకు, జగ్జీవన్‌రామ్‌నగర్‌కు చెందిన శైలజకు సుమారు పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నలుగురు ఆడ పిల్లలున్నారు. కొంతకాలంగా వీరిద్దరి మధ్య గొడ వలు జరుగుతున్నాయి. పెద్దల సమక్షంలో కూడా సరికాలేదు. దీంతో కొన్ని రోజుల క్రితం శైలజ ఇంట్లో సామాన్లు, పిల్లలను తీసుకుని తన పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఇద్దరూ విడిగా ఉంటున్నారు. ఆదివారం స్పందన గ్రూపు మీటింగ్ నిమిత్తం శైలజ తన తల్లి ఇంటి నుంచి స్థానిక సీఎస్ఐ పాఠశాల సమీపంలో ఓ మహిళ ఇంటికి వచ్చి రోడ్డుపై నిలబడి స్పందన గ్రూపు సభ్యులతో మాట్లాడుతుంది. అదే సమయంలో ఆమె భర్త రామకృష్ణ తన ద్విచక్ర వాహనంపై అక్కడకు వ చ్చి, నిలబడి ఉన్న వారిని వాహనంతో ఢీ కొట్టా డు. దీంతో అక్కడున్న మహిళలు కింద పడి పో యారు. ఇద్దరు మహిళకు ముఖంపై గాయాల య్యా యి. ఆ వెంటనే రామకృష్ణ తనతో తెచ్చుకున్న కత్తి పట్టుకుని తన భార్య శైలజపై దాడి చేయగా ఆమె తప్పించుకునే ప్రయత్నంలో ఆ పక్కనే ఉన్న ముప్పిడి చిన వెంకటేశ్ ఇంటి ఖాళీ స్థలంలోకి పరుగులు తీసింది. అక్కడ ఆమె పై కత్తితో విచక్షణా రహితంగా దాడి చేస్తుండగా అక్కడే ఉన్న ఇంటి యజమాని వెంకటేశ్, స్పందన మహళలు అడ్డుకోగా వారి పైకి కత్తి ఎత్తి అడ్డు వస్తే చంపుతామని బెదిరించాడు. అడ్డుకున్న వారికీ స్వల్ప గాయాలయ్యాయి. శైలజ తలపై, ఎడమ చేతిపై నరికి రామకృష్ణ పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన శైలజను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో రాజమండ్రి తరలించారు. ఘటనా స్థలానికి స్థానిక డీఎస్పీ యు.రవి చంద్ర, సీఐ కృష్ణబాబు, ఎస్సై జబీర్ చేరుకుని వివరాలు సేకరించారు. నిందితుడు రామకృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా వీరి పెద్దకుమార్తె స్థానిక గురుకుల పాఠశాలలో చదువుతుంది. ఈ నెల ఏడో తేదీన జరిగిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌కు రామకృష్ణ, శైలజ విడివిగా పాఠశాలకు వెళ్లి కుమార్తెతో గడిపి వచ్చారు. ఈ ఘటన చూసిన స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు.

వాహనాల తనిఖీ

ఏలూరు క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమా దాలను నివారించేందుకు, అక్రమ రవాణా అరికట్టేందుకు జి ల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదే శాల మేరకు పోలీసులు శనివా రం రాత్రి జిల్లా వ్యాప్తంగా వాహనాలను తనిఖీ చేశారు. జాతీయ రహదారుల్లో వాహనదారులను ఆపి డ్రైవర్‌కు ఫేస్‌వాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదా రులకు అపరాధరుసుము విధించారు.

క్రైమ్ కార్నర్

సారా స్థావరంపై దాడి



బెల్లపు ఊటను పారబోస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

చింతలపూడి/టి.నరసాపురం డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఎక్సైజ్ అధికారులు ఏపిగుంట గ్రామంలో సారా స్థావరాలపై దాడులు జరిపారు. పాయం వెంకటే శ్వరరావు అనే వ్యక్తి నుంచి 25 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అతను సారా తయారు చేస్తున్నట్టు సమాచారం తెలుసుకుని ఆ స్థావ రాలపై దాడి చేసి వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.అశోక్ తెలిపారు. ఎస్ఐలు నరసింహారావు, ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

కోడి వ్యర్థాల రవాణాపై కేసు

భీమడోలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కోడి మాంసం వ్యర్థాలను తరలిస్తున్న వ్యానును స్వాధీనం చేసుకున్నట్లు భీమడోలు పోలీసులు తెలిపారు. భీమడోలు మండలం పూళ్ళ గ్రామం వైపు కోడి మాంసం వ్యర్థాలు వెళ్తున్నట్లుగా వచ్చిన సమాచారం మేరకు పూళ్ళ వంతెన సమీపంలో భీమడోలు పోలీసులు నిఘా పెట్టారు. నిడమర్రు మండలం తోకలపల్లి గ్రామానికి చెందిన సుబ్బరాజు అనే వ్యక్తి బొలెరో వ్యానులో రాజమండ్రి పరిసర ప్రాంతాల నుంచి 1.5 టన్నుల వ్యర్థాలను లోడు చేసుకుని తోకలపల్లి గ్రామంలో సాగు చేస్తున్న చేపల చెరువులకు మేతగా వేయడానికి తరలిస్తున్నారు. దీనిపై పోలీసులు వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేలపై దాడులు

భీమడోలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కోడి పందేలు ఆడుతున్న వారిపై భీమడోలు పోలీసులు దాడి చేశారు. ఈ కోడి పందేలు ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.రెండు వేల 100 నగదు, ఒక కోడి, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మందుబాబుల వీరంగం

ద్వారకాతిరుమల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మంద్యం దుకాణంలో ఫుల్‌గా తాగి ఘర్షణ పడి కొందరు మందుబాబులు విచక్షణా రహితంగా దాడులకు దిగారు. మద్యంమత్తులో వీరంగం సృష్టించారు. ఒకరిపై మరొకరు దాడులకు తెగబడ్డారు. అడ్డు తగిలిన పోలీసులను సైతం వారు లెక్కచేయలేదు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ద్వారకాతిరుమల నుంచి వెంకటకృష్ణాపురం వెళ్లే మార్గంలో ఉన్న ఓ మద్యం దుకాణానికి జంగారెడ్డిగూడెం మండలం లక్కవరానికి చెందిన కొందరు పెయింటర్లు ఆదివారం మద్యం తాగేందుకు వచ్చారు. ఫూటుగా మద్యం తాగారు. తరువాత అక్కడున్న వెయిటర్‌ను తినేందుకు ఏదో తెమ్మన్నారు. అతను నిరాకరించడంతో ఆ వెయిటర్‌పై ముందుగా దాడికి తెగబడ్డారు. అయితే ఈ ఘర్షణను ఆపేందుకు మధ్యలో అడ్డువెళ్లిన గ్రామానికి చెందిన భీమవరపు అంజిబాబుపై బీరు బాటిల్‌తో దాడి చేశారు. దీంతో అంజిబాబుకు, లక్కవరానికి చెందిన ఒక మందుబాబు తలకు తీవ్ర గాయాలవడంతో స్థానికులు వారిని పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. షాపుల వద్ద సిట్టింగ్‌లను వ్యాపారులు పోత్సహించడమే ఇటువంటి గొడవలకు కారణమవుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు.

షోరూం తాళం

పగులగొట్టి చోరీ

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోహన సాయి మోటార్స్ కంపెనీ షటర్‌ను ఈ నెల ఏడవ తేదీ రాత్రి పగలగొట్టి అందులోని ద్విచక్ర వాహనం, ల్యాప్ టాప్, సామ్‌సంగ్ సెల్ ఫోన్, కొంత నగదును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకు పోయినట్లు షోరూం నిర్వాహకులు బొళ్ల రాము ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కే జబీర్ తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసులు అపహరణ

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన పంతెన లక్ష్మీ కుమారి స్థానిక పేరంపేట రోడ్డులో నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్రవాహనంపై మాస్కు ధరించుకుని వచ్చి ఆమె మెడలో రెండు బంగారు గొలుసులను తెంపుకుపోయిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. బాధితురాలు లక్ష్మీకుమారి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లక్ష్మీకుమారి ఆదివారం రాజమండ్రి వెళ్లి తిరిగి అదే రోజు రాత్రి జంగారెడ్డిగూడెం చేరుకున్నారు. స్థానిక గంగానమ్మ గుడి దగ్గర బస్సు దిగి పేరంపేట రోడ్డులోని శివాలయం వద్ద ఆమె ఇంటికి నడు చుకుంటూ వెళ్తుండగా శివాలయం వద్దకు చేరు కునేసరికి గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలో ఉన్న ఆరు కాసుల బంగారు గొలుసులను తెంపు కుపోయాడు. దీంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ కృష్ణ బాబు, ఎస్సై జబీర్ సంఘట నా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

చదవడం మాకిష్టం

పెదవేగి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయం అంటే విజ్ఞాన గని అని పెదవేగి శాఖా గ్రంథలయ గ్రంథపాలకుడు టి.అరుణ్‌కుమార్ అన్నారు. గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేశారు. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ చదువుతోపాటు సృజనాత్మకతను పెంచే కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా వ్యక్తిలో అంతర్లీనంగా ఉండే కళలు వెలికి వస్తాయని చెప్పారు. చదువుతోపాటు పుస్తక పఠనం చేయడం వ్యక్తి ఉన్నతికి దోహదపడు తుందన్నారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా పుస్తకా లు చదవాలని అదే వారి జీవితాన్ని ఉన్నతమైన దిశగా నడిపిస్తుందన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు

కుక్కునూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం కుక్కునూరులోని శ్లోకా కాన్సెప్ట్ స్కూల్ ప్రాంగణంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 300 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనుపత్రి మేనేజ్మెంట్ సభ్యులు బీమ్‌రెడ్డి బాబురెడ్డి, సీహెచ్.శివరామకృష్ణపాల్గొన్నారు

.70 మందికి వైద్య సేవలు

పోలవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టిసీమ ఫెర్రీ రేవులో శ్రీరామకృష్ణ గీతా శ్రమంలో ఆదివారం వరల్డ్ టీచర్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. 70 మంది వైద్య సేవలు పొందినట్లు తెలిపారు. ఆశ్రమ నిర్వాహకురాలు మాతాశ్రీ నందుల స్వరాజ్యలక్ష్మి తెలిపారు.

'నన్' శిక్షణకు వచ్చిన బాలిక ప్రసవం

ఏలూరు క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నన్‌గా శిక్షణ పొందే మిషనరీ సంస్థలో ఉన్న ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదివే బాలిక ఆడ శిశువుకు జన్మనిచ్చింది. స్నేహితుల సహకారంతో ఆ విద్యార్థిని కాన్పు చేయించుకుని పుట్టిన ఆడ శిశువును పక్కనే ఉన్న ఒక ఇంటి ఆవరణలో పారవేయడంతో, గుర్తించి వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ సంఘటన ఏలూరు నగరంలో తీవ్ర కలకలం రేకెత్తించింది. ఏలూరు అశోక్‌నగర్‌లోని ఒక మిషనరీ సంస్థలో మహిళలు నన్స్‌గా శిక్షణ పొందుతూ మరోవైపు నగరంలో ఉన్న ఆ సంస్థలకు చెందిన కళాశాలల్లో విద్యను అభ్యసిస్తుంటారు. కర్నూలు జిల్లా నంద్యాలకి చెందిన ఒక బాలిక నన్‌గా తన జీవితాన్ని అంకితం చేసుకుని అక్కడ శిక్షణ పొందుతూ మరోవైపు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ప్రతిరోజు యధావిధిగా అక్కడ నుంచి కాలేజికి వెళ్లి వస్తూ ఉంటుంది. వారికి ట్యూషన్లు చెప్పడానికి ఆ సంస్థలకు చెందిన బ్రదర్స్ వస్తూ పోతూ ఉంటారు. ఆ యువతి ఆదివారం వేకువజామున ప్రసవం కావడంతో ఆమె గదిలో ఉన్న తోటి స్నేహితుల సహకారంతో కాన్పు జరిపారు. ఆ బిడ్డను ప్రాణంతో ఉండగానే పడవేశారా అనేది తెలియాల్సి ఉంది. ఆ సంస్థ పక్కనే ఉన్న ముగ్గళ్ల సత్యనారాయణ ఇంటి ఆవరణలో ఉదయం ఆ శిశువు రక్తపు మరకలతో మృతి చెంది ఉండడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, టూ టౌన్ సీఐ వైవీ రమణ, సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. తెల్లవారుజామున ఆ బిడ్డను నన్స్ వసతి గృహం నుంచి విసిరారని ఒక మహిళ చెప్పడంతో పోలీసులు నేరుగా వసతి గృహంలోకి వెళ్లి తనిఖీ చేశారు. ప్రసవించిన యువతి అస్వస్థతతో కొట్టుమిట్టాడుతుండగా వెంటనే 108 అంబులెన్సులో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇంత జరిగినా ఆ సంస్థ నిర్వాహకులు మాత్రం నోరుమెదపలేదు. తమకు ఏమి తెలియనట్లుగా వ్యవహరించడం గమనార్హం. జిల్లా సంరక్షణ అధికారిణి సూర్యచక్రవేణి ఆదేశాల మేరకు చైల్డ్‌లైన్ ఉద్యోగిని పసల ధనలక్ష్మి ఈ సంఘటనపై ఏలూరు టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రదర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

గెలిచేదెవరు..?

ఎమ్మెల్సీ ఫలితాలపై ఉత్కంఠ

గోపిమూర్తికి బలంగా పనిచేసిన యూటీఎఫ్

గతంలో పోటీచేసిన గంధం నారాయణరావు

వీరిద్దరి మధ్యే ప్రధాన పోటీ అని ప్రచారం

ఫలితాలపై జోరుగా బెట్టింగ్‌లు

నిడమర్రు డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజ కవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. సోమవారం ఫలితాలు విడుదలకానున్నాయి. మొత్తం తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కాకినాడ, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతా రామరాజు జిల్లాల పరిధిలోని 116 పోలింగ్ కేంద్రాల్లో 92.62 శాతం పోలింగ్ నమోదైంది. 16,737 మంది ఓటర్లకు గాను 15,502 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పనిచేసిన షేక్ సాబ్జీ గతేడాది ఆకివీడు వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. సాబ్జీ వారసుడుగా తెరమీదకు వచ్చిన యూటీఎఫ్ నాయకుడు భీమవరానికి చెందిన బొర్రా గోపిమూర్తి పోటీలో ఉన్నారు. పది సంవత్సరాల సర్వీసు వదులుకుని రాజీనామా చేసి ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలబడగా మరోపక్క మిగిలిన 16 ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన గంధం నారాయణరావు పోటీలో నిలడ్డారు. ఐదుగురు అభ్యర్థులు పోటీలో నిలవగా ప్రధానంగా పోటీ మాత్రం వీరిద్దరి మధ్యే ఉంది. సాబ్జీ వారసుడిగా ముందుకు వచ్చిన గోపిమూర్తికి యూటీఎఫ్ అండగా నిలబడింది. ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. అధిక శాతం ప్రభుత్వ పాఠశాలలు ఉపాధ్యాయులే నమోదు చేసుకోగా ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులు పెద్దగా నమోదు చేసుకోలేదని మొత్తం ఓట్లలో వారివి మూడు వేలే ఉంటాయని అంచనా వేస్తున్నారు. ఇది కూడా గోపిమూర్తి విజయానికి అవకాశాలు ఉన్నట్టు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరోపక్క గంధం నారాయణరావు విజయంపై ఆయా సంఘాల నాయకులు పూర్తి విశ్వాసంతో ఉన్నారు. అన్ని ఉపాధ్యాయ సంఘాల మద్దతు నారాయణ రావుకు ఉండడం ఆయనకు కలిసొచ్చే అంశం. కార్పొరేట్ విద్యాసంస్థల ఉపాధ్యాయులు, ప్రైవేటు విద్యాసంస్థల ఓటర్లు ఈయనకు అనుకూలంగా చేశారని ప్రచారం జరుగుతుతోంది. ఓసీ కార్డును ఆయన వర్గీయులు బలంగా నమ్ముకొన్నారు. గతంలో కూడా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఆయన పోటీ చేయడం, ఓటర్లు అందరికీ ఆయన సుపరిచరితుడు కావడం కలిసొచ్చే అంశంగా భావిస్తున్నారు..

ఫలితాలపై జోరుగా పందేలు

పందెం ఎమ్మెల్సీ ఫలితాలపై కూఆ జోరుగా పందేలు కాశారు. ఎన్నికల ప్రారంభ సమయంలో గోపిమూర్తి - గంధం నారాయణ రావుల మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని ఆది నుంచి ప్రచారం జరుగు తోంది. మొదట్లో గోపిమూర్తి గెలిస్తే లక్ష రూపాయలు, గంధం నారాయణరావు గెలిస్తే లక్షా 50 వేలు ఇవ్వాల్లి ఉంటుందని పందేలు జోరుగా జరిగాయి. డిసెంబరు 5న ఎన్నికల సరళి చూసిన తర్వాత పందేల సరళి కూడా మారిపోయింది. గోపి మూర్తి మరింత హెచ్చు లోకి వెళ్లినట్లు పందెం రాయుళ్ల వద్ద సమాచారం. దీంతో పందేలు ఒకటికి మూడు రెట్లు అన్నట్టు కాస్తున్నారు. గోపిమూర్తి గెలిస్తే లక్ష, గంధం నారాయణరావు గెలిస్తే 2 లక్షల నుంచి 3 లక్షల వరకు ఇవ్వాల్సి ఉంటుందని పందేలు కాస్తున్నారు. సోమవారం సాయంత్రం 3 గంటల నాటికి ఫలితాలపై ఓ స్పష్టత రావచ్చని విశ్లేకులు చెబుతున్నారు.

'నన్' శిక్షణకు వచ్చిన బాలిక ప్రసవం

ఏలూరు క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నన్‌గా శిక్షణ పొందే మిషనరీ సంస్థలో ఉన్న ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదివే బాలిక ఆడ శిశువుకు జన్మనిచ్చింది. స్నేహితుల సహకారంతో ఆ విద్యార్థిని కాన్పు చేయించుకుని పుట్టిన ఆడ శిశువును పక్కనే ఉన్న ఒక ఇంటి ఆవరణలో పారవేయడంతో, గుర్తించి వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ సంఘటన ఏలూరు నగరంలో తీవ్ర కలకలం రేకెత్తించింది. ఏలూరు అశోక్‌నగర్‌లోని ఒక మిషనరీ సంస్థలో మహిళలు నన్స్‌గా శిక్షణ పొందుతూ మరోవైపు నగరంలో ఉన్న ఆ సంస్థలకు చెందిన కళాశాలల్లో విద్యను అభ్యసిస్తుంటారు. కర్నూలు జిల్లా నంద్యాలకి చెందిన ఒక బాలిక నన్‌గా తన జీవితాన్ని అంకితం చేసుకుని అక్కడ శిక్షణ పొందుతూ మరోవైపు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ప్రతిరోజు యధావి. దిగా అక్కడ నుంచి కాలేజీకి వెళ్లి వస్తూ ఉంటుంది. వారికి ట్యూషన్లు చెప్పడానికి ఆ సంస్థలకు చెందిన బ్రదర్స్ వస్తూ పోతూ ఉంటారు. ఆ యువతికి ఆదివారం వేకువజామున ఆమె గదిలో ఉన్న తోటి స్నేహితుల సహకారంతో కాన్పు జరిపారు. ఆ బిడ్డను ప్రాణంతో ఉండగానే పడవేశారా అనేది తెలియాల్సి ఉంది. ఆ సంస్థ పక్కనే ఉన్న ముగ్గళ్ల సత్యనారాయణ ఇంటి ఆవరణలో ఉదయం ఆ శిశువు రక్తపు మరకలతో మృతి చెంది ఉండడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, టూ టౌన్ సీఐ వైవీ రమణ, సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. తెల్లవారుజామున ఆ బిడ్డను నన్స్ వసతి గృహం నుంచి విసిరారని ఒక మహిళ చెప్పడంతో పోలీసులు నేరుగా వసతి గృహంలోకి వెళ్లి తనిఖీ చేశారు. ప్రసవించిన యువతి అస్వస్థతతో కొట్టుమిట్టాడుతుండగా వెంటనే 108 అంబులెన్సులో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇంత జరిగినా ఆ సంస్థ నిర్వాహకులు మాత్రం నోరు మెదపలేదు. తమకు ఏమీ తెలియనట్లుగా వ్యవహరించడం గమనార్హం. జిల్లా సంరక్షణ అధికారిణి సూర్యచక్రవేణి ఆదేశాల మేరకు చైల్డ్‌లైన్ ఉద్యోగిని పసల ధనలక్ష్మి ఈ ఘటనపై ఏలూరు టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రదర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

హరికథా దాసుడు అనందాసు



ఆరు దశాబ్దాలుగా హరికథా గానం

వృద్ధాప్యంలోను సడలని గాత్రం

ముదినేపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆయన గాత్రం మధురం.. గానం సుమధురం.. పురాణాలు, ఇతిహాసాలను అవలీలగా వల్లె వేయగల కథకుడు. ఎనిమిది పదుల వయస్సు దాటినా తన కంచు కంఠంతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నారు. ముదినేపల్లి మండలం చేవూరుపాలెంకు చెందిన సువర్ణ గంటా కంకణ బిరుదాంకితుడు అనందాసు కృష్ణమూర్తి భాగవతార్ ప్రస్థానం యువతకు స్ఫూర్తి. 60 ఏళ్ల క్రితం హరికథలు నేర్చుకుని ఉమ్మడి కృష్ణా జిల్లాలో సాటిలేని మేటి కథకు డిగా గుర్తింపు పొందారు. ఎన్నో సత్కారాలు పొందారు. ఆయన సమకాలికులు హరికథలు చెప్పడం ఏనాడో విరమించుకోగా, కృష్ణమూర్తి భాగవతర్ మాత్రం హరికథల పై ప్రేమతో వృద్ధాప్యం మీదపడినా ఇప్పటికీ హరికథా గానం చేస్తూనే ఉన్నారు. ఆయన ఇప్పటి వరకు 6000 హరికథా గాన ప్రదర్శనలు నిర్వహించారు.


చదివింది ఐదో తరగతి..!

1940లో చేవూరుపాలెంలో రంగయ్య, రంగ నాయకమ్మ దంపతులకు జన్మించిన అనందాసు కృష్ణమూర్తి 5వ తరగతి వరకు మాత్రమే చదువుకున్నారు. కొంతకాలం తర్వాత శ్రీహరిపురంలో అడుసుమిల్లి చిన్నయ్య వద్ద భజనలు నేర్చుకున్నారు. తర్వాత వీరవాసరంలో ప్రముఖ భాగవతార్ పులఖండం జానకి రామయ్య వద్ద శిష్యరికం చేశారు. 1962లో కృష్ణమూర్తి 22వ ఏట స్వగ్రామం చేవూరు పాలెం రామాలయం వద్ద ఉత్తర గోగ్రహణంపై తొలి హరికథ చెప్పి గ్రామస్థులను మెప్పించగలిగారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల శివలీలలు, బ్రహ్మంగారి చరిత్ర, భారతం, భాగవతంపై హరికథలు చెప్పారు. ఒడిశాలోని రూర్కెలా ఉక్కు కర్మాగారం వద్ద యాజమాన్యం ఆహ్వానంపై హరికథ చెప్పి ఘన సన్మానం పొందారు. కర్నాటక, మద్రాసు రాష్ట్రాల్లో కూడ వందల సంఖ్యలో హరికథల ప్రదర్శన ఇచ్చారు.

కంకణ ధారణ

రాష్ట్ర వ్యాప్తంగా వేలాది హరికథల ప్రదర్శనలిచ్చి పరిపూర్ణ భాగవతార్‌గా రూపాంతరం చెందిన కృష్ణమూర్తి భాగవతార్ కంకణ ధారణ గౌరవం పొందారు. సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ప్రముఖ రంగ స్థల నటుడు మద్దాల రామారావు కంకణం తొడిగి సువర్ణ గంటా కంకణ బిరుదునిచ్చి సత్కరించారు.

సుమారు 65 ఏళ్లుగా కృష్ణమూర్తి భాగవతార్ హరికథాగానంతో ప్రజాభిమానం పొందాడు. హరికథలకు ఆదరణ తగ్గినప్పటికీ ఆయన కథ చెబుతున్నాడంటే ఇప్పటికీ జనం వస్తారు. కృష్ణమూర్తి సతీమణి మణి శకుం తల కూడ భర్తను కళారంగంలో ప్రోత్సహిం చడం కారణంగా ఆయన హరికథాగానంపై ప్రత్యేక శ్రద్ధ చూపించగలిగారు. ఇప్పటి ఆయన ప్రదర్శనలతో కృష్ణమూర్తి జీవిత మంతా కళా రంగానికే అంకితమైంది.





22 ఏళ్ల వయసు, 80 ఏళ్ల వయసులో హరికథా గానం చేస్తున్న కృష్ణమూర్తి

ఈ భవనాల గతేంటి?



మట్టగుంటలో శిథిలావస్థలో పంచాయతీ కార్యాలయం

సిబ్బంది పాట్లు



పెదలంకలో జల దిగ్బంధంలో పంచాయతీ భవనం

కలిదిండి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో మట్టగుంట, పెదలంక గ్రామాల పంచాయతీ కార్యాలయ భవనాలు శిథిలావస్థకు చేరాయి. మట్టగుంట పంచాయతీ కార్యాలయ భవనం స్లాబ్ పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటపడ్డాయి. గోడలు బీటలు వారాయి. కూలిపోవటానికి సిద్ధంగా ఉండటంతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం భవనంలో పంచాయతీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం భవనం శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉండి పాములకు నిలయంగా మారింది. నాలుగు దశాబ్దాల క్రితం ఈ భవనం నిర్మించారు. ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టిన దాఖలాల్లేవు. దీంతో ఈ దుస్థితి నెలకొందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

● పెదలంక గ్రామ పంచాయతీ భవనానిదీ అదే తీరు. స్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. కొద్దిపాటి వర్షానికే భవనం చుట్టూ నీరు చేరుతోంది. రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో సిబ్బంది, ప్రజలు పలు అవస్థలు పడుతున్నారు. నూతన సచివాలయ భవనం వద్దకు వెళ్లి పంచాయతీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. మట్టగుంట, పెదలంక గ్రామాల్లో నూతన పంచాయతీ కార్యాలయాల భవనాలు నిర్మించాలని ఐదేళ్లుగా పాలకులు, అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి.

నిధులు రాగానే నిర్మాణం : ఏఈఈ

ఈ విషయమై పంచాయతీ రాజ్ ఏఈఈ బి.శ్రీనివాస్‌ను వివరణ కోరగా, మట్టగుంట, పెదలంక గ్రామాల్లో నూతన పంచాయతీ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. నిధులు మంజూరు కాగానే నూతన భవనాల నిర్మాణం చేపడతామన్నారు.



అమ్మగారికి దండం పెట్టు..

సంక్రాంతి దగ్గర పడుతుండటంతో గ్రామాల్లో డూడూ బసవన్నల సందడి మొదలైంది. కొత్త ధాన్యం రాగానే గంగిరెద్దు ఇంటి ముందుకు వస్తే శుభం కలుగుతుందని రైతు కుటుంబాలు భావిస్తాయి. గంగిరెద్దును అందంగా అలంకరించి డోలు, సన్నాయి వాయిస్తూ ప్రతి ఇంటి ముందుకు వచ్చి అయ్య గారికి దణ్ణం పెట్టు, అమ్మగారికి దణ్ణం పెట్టు అంటూ గంగిరెద్దును ఆడించి, పాడి పంట సమృద్ధిగా కలగాలని ఆరోగ్యం, ఐశ్వర్యం కలగాలని గంగిరెద్దుల వాళ్ళు శుభాశీస్సులు పలుకుతారు. సంక్రాంతి నెలలో గృహం ముందు వేసిన రంగవల్లిలోకి గంగిరెద్దు వచ్చి నిలబడితే మంచి జరుగుతుందని గ్రామీణుల విశ్వాసం.

-చాట్రాయి

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

కలిదిండి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 10 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని తహసీల్దార్ రామకృష్ణ ప్రకటనలో కోరారు. 10న వెంకటాపురం, 11న పెదలంక, 12న కాళ్లపాలెం, 13న కోరుకొల్లు, 16న తాడినాడ, 17న పోతుమర్రు, 18న ఆవకూరు, 19న కొండూరు, 20న కలిదిండి సదస్సులు జరుగుతాయన్నారు. అలాగే 21న సానారుద్రవరం, 23న కొచ్చె ర్ల, 27న కొండంగి, 28న మట్టగుంట, 30న అమ రావతి గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు.

ముసునూరులో..

ముసునూరు: మండలంలో ఈ నెల 10వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ తెలిపారు. బలివే గ్రామంలో 10వ తేదీ, లోపూడిలో 11న, అక్కిరెడ్డిగూడెంలో 12న, యల్లాపురంలో 13న, గుళ్ళపూడిలో 16న, కొర్లకుంటలో 17న, ముసునూరులో 18న, వేల్పుచర్లలో 19న సూరేపల్లిలో 20న సదస్సులు జరుగుతాయన్నారు. అలాగే రమణక్కపేటలో 21న, చిల్లబోయినపల్లిలో 23న, కాట్రేనిపాడులో 24న, చింతలవల్లిలో 26న, చెక్కపల్లిలో 27న, గోపవరంలో 28 నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహించే ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

'ఐక్యవేదిక' నూతన కమిటీ

మండవల్లి డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలను చైతన్యపరచి తమ సమస్యలను తామే పరిష్కరించుకునేలా శిక్షణ ఇవ్వటమే ప్రజా స్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక లక్ష్యమని వేదిక రాష్ట్ర నాయకుడు ఎల్ఎస్ భాస్కరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ పాఠశాల-2లో ఆదివారం మండల కమిటీ అధ్యక్షుడు టి. అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మండవల్లి మండల నూతన కమిటీ నియామకం జరిగింది. అధ్యక్షులుగా గంజాల శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులుగా ప్రొఫెసర్ ఎస్ విజయకుమార్, బండారు వెంకయ్య, బండి రంగారావు, ప్రధాన కార్యదర్శిగా కుందేటి అర్జునరావు, ఉపాధ్యక్షులుగా ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, బోనం నాగరాజు, కార్యదర్శిగా వెలకపల్లి బేబి సరోజిని, వరద శ్యామ్, పొన్నూరు రామచంద్రరావు, కోశాధికారి టి. అప్పారావు, కార్యవర్గ సభ్యులుగా గుడివాడ గణేష్, ఈలి జ్యోతి, కె. మార్కు రాజును ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు భాస్కరరావు తెలిపారు.

మాజీ సర్పంచ్ కోటేశ్వరరావుకు ఘన నివాళులు

ముదినేపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండలం ములకలపల్లి పంచాయతీ సర్పంచ్ నువ్వుల కోటేశ్వరరావు మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన సంస్మరణ దినం సందర్భంగా ములకలపల్లిలో జరిగిన సంతాప సభలో పలువురు నాయకులు కోటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బొప్పన సుందరరామయ్య, కొయ్యగూడపాడు మాజీ సర్పంచ్ కొరివి గోపి హైదరాబాద్‌కు చెందిన బిల్డర్లు యార్లగడ్డ వెంకట రమణ, మనవల్లి నారాయణ, రైల్వే కాంట్రాక్టర్ పరుచూరి సురేష్‌బాబు, రమేష్ తదితరులు కోటేశ్వరరావుకు శ్రద్ధాంజలి ఘటించి, ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు.

అర్హులందరికీ ఇళ్లు : మంత్రి సారథి



నూజివీడు టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ నివేశనా స్థలాలతో పాటు పక్కా ఇళ్ల నిర్మాణమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడులో టూ వీలర్స్ మెకానిక్‌ల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ మెకానిక్‌లకు పక్కా గృహాలు నిర్మించే బాధ్యత తనదన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి గృహ నిర్మాణంకు ప్రభుత్వం రూ.3 లక్షలు అందిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.2 లక్షల వరకు సబ్సిడీ వర్తిస్తుందని ఆసక్తి ఉన్న వారు ఇంటి నిర్మాణం చేపడితే తన సహకారం ఉంటుందన్నారు. రాష్ట్రంలో 25 లక్షల ఇళ్లు కట్టించనున్నట్టు చెప్పా రు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజనతో కలిపి ఈ పథకాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. నూజివీడు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గా ప్రసాద్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మల్లిశెట్టి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు

నూజివీడు అభివృద్ధికి సమష్టి కృషి అవసరం

నూజివీడు టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి సమష్టి కృషి అవసరమని ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు. నూజివీడు ఎస్.ఆర్.ఆర్ బాలుర ఉన్నత పాఠశాలల 1983-84 టెన్త్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ నాడు విద్యా రంగ అభివృద్ధికి జమీందార్లు ఎంతో కృషి చేశారని విద్యా రంగంలో నూజివీడుకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. నాటి ఉపాధ్యాయులు కృష్ణారావు, వైవి రాజు, నరసింహారావు, ప్రసాదరావు తదితరులను ఘనంగా సత్కరించారు.



మొక్కుతీర్చుకున్న సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి

చాట్రాయి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఆదివారం మొక్కు తీర్చుకున్నారు. తాను ఎన్నికల్లో గెలుపొందితే వీరాంజనేయస్వామిని దర్శించుకుంటానని ఆమె మొక్కుకొని ఈ రోజు మొక్కులు తీర్చుకున్నారు. పూజలు అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే రాగమయిని ఘనంగా సన్మానించారు.

గురుస్వామికి సన్మానం

చాట్రాయి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అయ్యప్ప గురుస్వామిగా పేరొందిన అప్పారావు గురుస్వామిని ఆదివారం మండలంలోని చనుబండ శ్రీ కోదండ రామాలయంలో అయ్యప్ప దీక్షా దారులు ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను పలువురు కొనియాడారు.



మనోజ్‌కు బెస్ట్ ఫాదర్ అవార్డు

ముదినేపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ విశ్వ గురు వరల్డ్ రికార్డ్సు సంస్థ జాతీయ స్థాయిలో బెస్ట్ ఫాదర్ కామధేను అవార్డును 2024 సంవత్సరానికి ముదినేపల్లికి చెందిన వైద్యుడు, అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి తండ్రి డాక్టర్ మనోజ్‌కు అందజేసింది. సంస్థ చైర్మన్ సత్యవోలు రాంబాబు ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కామధేను అవార్డుల ప్రధానోత్సవంలో తెలంగాణ హైకోర్టు జడ్జి సూరేపల్లి నందా మనోజ్‌కు ఈ అవార్డును అందజేశారు. కుమార్తె వైష్ణవి కోర్కె మేరకు ఎకరన్నర పొలం, బంగారం అమ్మి అమరావతి రాజధాని నిర్మాణానికి నూతన సచివాలయ భవనాల నిర్మాణాలకు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణానికి, ఇతర అభివృద్ధి పనులకు సుమారు రూ.45 లక్షలు విరాళం ఇచ్చేందుకు సహకరించిన తండ్రిగా డాక్టర్ మనోజ్‌కు ఈ అవార్డు ఇవ్వటం అభినందనీయమని జస్టిస్ నందా పేర్కొన్నారు.





సింగరాయపాలెంలో పెడన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, మాజీ మంత్రి పిన్నమనేని పూజలు

భక్తులతో పోటెత్తిన సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయం

ప్రముఖుల పూజలు

ముదినేపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న షష్ఠి కల్యాణోత్సవాల్లో ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు జరిపారు. జిల్లా నుంచే కాక రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకున్నారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, గుడివాడ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు పిన్నమనేని బాబ్జీ తదితరులు ఆలయంలో పూజలు జరిపారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి, అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సత్కరించారు. పెద్ద సంఖ్యలో మహిళలు ఆలయ ఆవరణలోని నాగ ప్రతిమలకు పూజలు జరిపారు. ఈ సందర్భంగా గుడివాడ నటరాజ నాట్య కళాశాల బాలికలు నిర్వహించిన కూచిపూడి భరత నాట్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు బొంగు రవికుమార్, నీలం శివ రమేష్, పరసా కృష్ణ తదితరులు ఉత్సవ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఎస్ఐ వి.ఎస్.వీరభద్రరావు పోలీసు బందోబస్తు నిర్వహించారు.

కలిదిండి: పెదలంకలో షష్ఠి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకుని

ఆధ్యాత్మికం

పూజలు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. కోరుకొల్లు, వెంక టాపురం గ్రామాల్లో షష్ఠి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.



గంగానమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ

నూజివీడు టౌన్: రావిచర్ల గ్రామ దేవత గంగానమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు లావు కుటుంబ రావు చౌదరి తదితరులు పాల్గొన్నారు.



పెద్దింటమ్మకు భక్తుల తాకిడి

కైకలూరు: కొల్లేటికోట పెద్దింటమ్మ వారిని ఆదివారం ఏలూరు, పశ్చిమ గోదావరి, కృష్ణా తదితర జిల్లాల నుంచి భక్తులు పెద్దయెత్తున తరలివచ్చి పూజలు చేశారు. పాల పొంగళ్ళను సమర్పించి మొక్కులు చెల్లించుకు న్నారు. ఆలయ అధికారి కూచిపూడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను నిర్వహించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు నేడు తుది గడువు

చాట్రాయి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటర్లుగా నమోదయ్యేందుకు దరఖాస్తులకు ఈ నెల 9వ తేదీ సోమవారం వరకు గడువు అని అర్హత కలిగిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తహసీల్దార్ ప్రశాంతి కోరారు. డ్రాఫ్టు ఓటర్ల జాబితా తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉంచామని, ప్రజలు సదరు జాబితాను పరిశీలించుకొని అభ్యంతరాలను ఫారం-7లో, సవరణలకు ఫారం-8లో, ఓటు నమోదు కోసం ఫారం-18లో దరఖాస్తు చేసుకోవచ్చునని అన్నారు. 2021 నవంబరు 1వ తేదీ లోపు డిగ్రీ పట్టా పొందిన వారు అర్హులని తెలిపారు.

ముసునూరు: కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటర్ల నమోదుకు చివరి తేది 9 అని, అర్హులైన వారు ఓటర్లుగా నమోదు కావాలని ముసునూరు తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ తెలిపారు.

11 నుంచి మావుళ్లమ్మ దర్శనం నిలిపివేత

భీమవరం టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మావుళ్లమ్మ వార్షిక మహోత్సవాలు వచ్చే నెల 13 నుంచి జరగనున్న నేపథ్యంలో ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 11 నుంచి 25 వరకు అమ్మవారి మూల విరాట్ దర్శనం నిలిపివేస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ బుద్దా మహాలక్ష్మీనగేష్ తెలిపారు. 11న ఉదయం 11 గంటలకు అమ్మవారి కళాపకర్షణ చేస్తారని, 24 వరకు ఉత్సవమూర్తికి నిత్య పూజలు, కైంకర్యాలు నిర్వహిస్తారని తెలిపారు. 25న ఉదయం విశేష పూజల అనంతరం అమ్మవారి కళలను విగ్రహంలో నిక్షిపం చేసి మూల విరాట్ దర్శనం కల్పిస్తామన్నారు.

క్రైమ్ కార్నర్

భార్య మృతితో మనస్థాపం చెంది..

కైకలూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భార్య మృతి చెందడంతో మనస్థాపానికి గురైన వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కైకలూరు టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం ఆటపాక గ్రామానికి చెందిన అర్జంగి సత్యన్నారాయణ(62) తాపీపని చేస్తూ జీవిస్తున్నాడు. అతని భార్య అప్పాయమ్మ దీపావళి పండుగ రోజున అనారోగ్యంతో చనిపోయింది. అప్పటి నుంచి మానసికంగా బాధ పడుతున్న సత్యన్నారాయణ ఈ నెల 4న పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు గమనించి వెంటనే కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్సై వెంకట్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

ముదినేపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం వడాలికి చెందిన వివాహిత శనివారం అదృశ్యమైంది. తన భర్త బయటికి వెళ్లిన సమయంలో కుమార్తెను సైతం ఇంటిలో వదిలేసి వెళ్లిపోయింది. భర్త, బంధువులు రాత్రి వరకు ఆమె కోసం వెదికినా ఆచూకీ లభించలేదు. దీంతో భర్త ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

సారా స్వాధీనం..

చాట్రాయి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎ.ఆవులయ్య ఆధ్వర్యంలో మండలంలోని పోతనపల్లి చిన్న, పెద్ద తండాలలో ఆదివారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. దారావత్తు రామును అరెస్ట్ చేసి 120 లీటర్లు సారా, 2 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. దారావత్తు నాగరాజును అదుపులోకి తీసుకుని 20 లీటర్ల సారా, బైక్ స్వాధీనం చేసుకొని, 600 లీటర్లు బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. నిందితులతో పాటు సారా తయారీకి నల్ల బెల్లం సరఫరా చేస్తున్న వ్యాపారి వజ్రపు రాంబాబుపై కూడా కేసు నమోదు చేశామని చెప్పారు. దాడుల్లో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ పాండు రంగారావు, సబ్ ఇన్‌స్పెక్టర్లు ఆరిఫ్, ప్రసాద్ పాల్గొన్నారు.

కోడి పందేలపై దాడి

కలిదిండి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొండంగి గ్రామంలో నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని రూ.6,520 నగదు, రెండు కోడి పుంజులు, కోడికత్తులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.